




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక








సంపుటి: 5 సంచిక: 159, పేజీలు - 08

మంగళవారం, నవంబర్ 18, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD


# త్యాగధనుల పేరుతో లూటీ



## ప్రేక్షక పాత్రలో కలెక్టర్

- కంచే చేను మేస్తే.. కాపాడేదెవరు.?
- ప్రభుత్వ భూములపై 'పందేరం' కలెక్టర్ మౌనం వెనుక మర్మమేమిటి.?
- త్యాగం ముసుగులో.. భూ మాయ

**ఈ దేశపు మట్టి కోసం ప్రాణాలర్పించిన మహనీయులు మన స్వాతంత్ర్య సమరయోధులు. ఆ మట్టికి అంతటి పవిత్రత ఉంది కాబట్టే, వారి త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. కానీ, విచారకరమైన విషయం ఏమిటంటే ఎవరైతే దేశం కోసం సర్వస్వం ధారపోశారో, వారి పేరునే అడ్డుపెట్టుకుని కొందరు అక్రమార్కులు "భూ దందా"కు తెరలేపారు.సమరయోధుల కోటా పేరుతోనో, లేదా వారి వారసులమనో చెప్పుకుంటూ జరిగిన ఈ భూ కుంభకోణం కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాదు అది మన జాతి చరిత్రకు, ఆ త్యాగధనుల ఆత్మకు చేసిన తీరని ద్రోహం.పవిత్రమైన ఆశయాల ముసుగులో జరిగిన ఈ భూ ఆక్రమణల చిట్టాను, వెనుక ఉన్న కుట్రను వెలికితీయడమే ఈ వార్త ఉద్దేశం. ఇది చదువుతున్నప్పుడు మట్టి కోసం పోరాడిన వారెవరో, అదే మట్టిని మింగేయాలని చూస్తున్న వారెవరో మీకు స్పష్టంగా అర్థమవుతుంది.**

**భవిష్యత్ తరాలకు దక్కాల్సిన 10 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాహా.. నకిలీ 'స్వాతంత్ర్య సమరయోధుడి' పేరుతో భారీ స్కామ్ ఆర్డీవో నివేదికలో 'భూ మాయ' బట్టబయలు అయినా కలెక్టర్ మౌనం అక్రమార్కులపై చర్యలు శూన్యం, యథేచ్ఛగా నిర్మాణాలు, అమాయకులకు వల ప్రభుత్వ భూమిని తాకట్టు పెట్టి బ్యాంకులకు టోకరా.. విస్తుపోతున్న యంత్రాంగం**



జిల్లా కలెక్టరేట్



డి. భాస్కర్ రెడ్డి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ భూమి అంటే ప్రజల ఆస్తి. అది భావితరాల అవసరాల కోసం భద్రపరచాల్సిన సంపద. కానీ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. రక్షించాల్సిన జిల్లా కలెక్టరే, కళ్లెదుట వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా కోరల్లో చిక్కుకున్నా 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరిస్తుండటం సర్వత్రా విస్మయం కలిగిస్తోంది. ఉప్పల్ మండలం, బండ్లగూడలో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడటంలో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఘోరంగా విఫలమయ్యారని సామాజిక కార్యకర్త బాబా గౌడ్ ఆరోపించారు.

### స్వాతంత్ర్య సమరయోధుడి పేరుతో.. పక్కా ప్లాన్

దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన త్యాగధనుల పేరు చెప్పుకొని, ప్రభుత్వ భూమిని కొల్లగొట్టేందుకు ఒక భారీ కుట్ర జరిగింది. బండ్లగూడ గ్రామ పరిధిలో 'రాచకొండ కనకయ్య' అనే వ్యక్తిని నకిలీ స్వాతంత్ర్య సమరయోధుడిగా సృష్టించి 10 ఎకరాల భూమిని కొల్లగొట్టారు. ఈ తంతులో అప్పటి కలెక్టర్ ఎం.వి.రెడ్డి, అప్పటి కీసర ఆర్డీవో లచ్చిరెడ్డి, తహసీల్దార్ రమేష్ కుమార్, అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారులు, డీ. భాస్కర్ రెడ్డి అనే ప్రైవేట్ వ్యక్తితో కుమ్మక్కై రికార్డులను తారుమారు చేశారని సామాజిక కార్యకర్త బాబా గౌడ్ పేర్కొన్నారు.

### నిజం నిగ్గుతేల్చిన ఆర్డీవో.. నివేదిక బుట్టదాఖలు.?

ఈ వ్యవహారంపై ఫిర్యాదులు రావడంతో ప్రస్తుత కలెక్టర్ ఆదేశాల మేరకు కీసర ఆర్డీవో సమగ్ర విచారణ జరిపారు. ఈ విచారణలో సంచలనం కలిగించే విషయాలు వెలుగుచూశాయి:

- సదరు వ్యక్తి స్వాతంత్ర్య సమరయోధుడు కాదు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రికార్డుల్లో అతనికి గుర్తింపు లేదు.
- కేవలం భూమిని కాజేయడానికే తప్పుడు పత్రాలు సృష్టించారు.

ఈ మేరకు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని స్పష్టం చేస్తూ, 2025 సెప్టెంబర్ 18న ఆర్డీవో సాక్ష్యాధారాలతో కూడిన నివేదికను కలెక్టర్ కు సమర్పించారు. నివేదిక అంది రెండు నెలలు గడుస్తున్నా, కలెక్టర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారిందని బాబా గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.

### అమాయకులపై వల - బ్యాంకులకూ టోకరా.?

కలెక్టర్ నిర్లక్ష్యం కారణంగా భూ అక్రమార్కులు రెచ్చిపోతున్నారు, ఏకంగా ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారు.

- యథేచ్ఛగా నిర్మాణాలు: వివాదంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి.



మేడ్చల్ జిల్లా కలెక్టర్
మిక్కిలినేని మను చౌదరి

- అమాయకులకు విక్రయాలు: ఈ భూమి ప్రభుత్వానిదని తెలియని సామాన్య ప్రజలకు ప్లాట్లు, ఫ్లాట్లు అంటగట్టి మోసం చేస్తున్నారు. రేపు ప్రభుత్వం ఆక్రమణలను తొలగిస్తే, నష్టపోయేది అమాయక ప్రజలే కదా.?
- బ్యాంకులకు రుణాలు: ప్రభుత్వ భూమిని తనఖా పెట్టి జాతీయ బ్యాంకుల నుండి కోట్లాది రూపాయల రుణాలు పొందుతూ దేశ ఆర్థిక వ్యవస్థకే గండి కొడుతున్నారు.

### చర్యలు శూన్యం.. చర్చలే శరణ్యం.?

చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాల్సిన కలెక్టర్, వారితో చర్చలు జరుపుతున్నారని వస్తున్న వార్తలు జిల్లా యంత్రాంగం పనితీరును ప్రశ్నార్థకం చేస్తున్నాయని సామాజిక కార్యకర్త బాబా గౌడ్ ఆరోపిస్తున్నారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగిన చందంగా.. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటారా.? అని ఆయన మండిపడుతున్నారు. ఈ భూ కుంభకోణంపై దర్యాప్తు అధికారులకు, జాతీయ బ్యాంకుల నుండి అక్రమంగా రుణాలు పొందిన విషయంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ నిర్లక్ష్యంపై డీవోపీటీ లో కూడా ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూములకు కస్టోడియన్‌గా ఉండవలసిన జిల్లా కలెక్టర్ నిర్లక్ష్యం వహిస్తే, ఇక ప్రభుత్వ భూములను రక్షించేవారు ఎవరు.? అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

### చట్టం ఏం చెబుతోంది.?

నివేదిక ఉన్నా చర్యలు తీసుకోని కలెక్టర్ తీరుపై న్యాయ నిపుణులు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు: "రికార్డులు తారుమారయ్యాయని తెలిసినా మౌనం వహించడం అంటే.. ఆ నేరంలో భాగస్వామ్యం కావడమే."

- ఏఐఎస్ కాంటాక్ట్ రూల్స్ 1968: రూల్ 3(1) ప్రకారం ఒక ఐఏఎస్ అధికారి విధి నిర్వహణలో సంపూర్ణ చిత్తశుద్ధి కలిగి ఉండాలి. అక్రమార్కులతో చర్చలు జరపడం 'సర్వీస్ నిబంధనల ఉల్లంఘన' కిందకు వస్తుంది.
- ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్, 1988: సెక్షన్ 13(1)(డి) ప్రకారం ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించేలా వ్యవహరించడం, ఇతరులకు (భూ కబ్జాదారులకు) లబ్ధి చేకూర్చడం "క్రిమినల్ మిస్ కండక్ట్" అవుతుంది. దీనికి శిక్ష ఖాయం.
- రాజ్యాంగ ఉల్లంఘన: ప్రభుత్వ ఆస్తులను కాపాడటం కలెక్టర్ బాధ్యత. చర్యలు తీసుకోకపోతే హైకోర్టులో 'రిట్ ఆఫ్ మాండమస్' ద్వారా కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తుంది.

### తక్షణమే తీసుకోవాల్సిన చర్యలు..

భవిష్యత్ తరాలకు భూమిని మిగల్చాలంటే, ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని, తక్షణమే తీసుకోవాల్సిన చర్యలను బాబా గౌడ్ సూచించారు.

- తప్పుడు రికార్డులు సృష్టించిన అప్పటి అధికారులపై, భూ బకాసురులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.
- నివేదికను తొక్కిపెట్టిన ప్రస్తుత కలెక్టర్ తీరుపై శాఖాపరమైన విచారణ జరపాలి.
- ఆ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేసి, ప్రభుత్వ బోర్డులు పాతాలి.

బ్యాంకులకు లేఖలు రాసి, ఆ భూమిపై రుణాలు ఇవ్వకుండా అడ్డుకోవాలి.

ప్రజా ధనం, ప్రభుత్వ భూమి, ఎవరో సొంత జాగీరు కాదు. కలెక్టర్ మౌనం వీడి, తన కలం పదును చూపిస్తారా.? లేక అక్రమార్కులకే దాసోహం అంటారా.? అన్నది కాలమే నిర్ణయించాలి.

## బీహార్ సీఎం నితీష్ కుమార్ రాజీనామా

**- నవంబర్ 20న గాంధీ స్టేడియంలో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు**

పాట్నా (ప్రశ్న న్యూస్) బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ అఖండ విజయం సాధించిన తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై కసరత్తు జరుగుతోంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆదివారం (నవంబర్ 16) దీనికి సంబంధించి ఎన్డీయే కూటమి నేతల మధ్య సమావేశాలు జరిగాయి. మరోవైపు ఎన్నికల సంఘం గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌కు 243 మంది ఎమ్మెల్యేల జాబితాను సమర్పించింది. సోమవారం నాడు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మంత్రివర్గ సమావేశాన్ని

2లో..



**ప్రజాపాలన వారోత్సవాల తర్వాతే**

## స్థానిక ఎన్నికలు

**- తెలంగాణ కేబినెట్‌లో కీలక నిర్ణయాలు**



- రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు
- వారోత్సవాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌పై కీలక నిర్ణయాలు

2లో..

## వైజాగ్ స్టీల్ పై మా స్టాండ్ ఇదే.!

**- తేల్చేసిన చంద్రబాబు**




అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో కేంద్రం మొదలుపెట్టిన వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం పలు మలుపులు తీసుకుంటూ ఇప్పటికీ రాజకీయంగా చర్చనీయాంశమవుతూనే ఉంది. అయితే కొంతకాలంగా కార్మికులు ఉద్యమాలు చేస్తుండటంతో ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం పరోక్షంగా మాత్రమే అడుగులు వేస్తోంది. కానీ తాజాగా వైజాగ్ లో సీఐఐ సదస్సు సందర్భంగా సీఎం చంద్రబాబు మీడియా ప్రశ్నలకు సమాధానం ఇచ్చే విషయంలో స్టీల్ ప్లాంట్

2లో..

# సౌదీ ప్రమాదంలో హైదరాబాదీలు

# సజీవ దహనం

- సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది మృతి
- మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది ఉన్నారని అధికారిక ప్రకటన
- ఉమ్రా యాత్ర ముగించుకుని మదీనా వెళ్తుండగా బస్సు, ట్యాంకర్ ఢీ
- మృతుల సంఖ్యను ధృవీకరించిన తెలంగాణ హజ్ కమిటీ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాద్ వాసులు మరణించినట్లు తెలంగాణ హజ్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లిన వీరి ప్రయాణం విషాదాంతంగా ముగిసింది. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది ఉండటం అందరినీ తీవ్రంగా కలచివేస్తోంది. ఈ దుర్ఘటనతో హైదరాబాద్ నగరంలో, ముఖ్యంగా మృతుల కుటుంబాల్లో తీరని విషాదం అలుముకుంది.

### ప్రమాదం జరిగిందిలా.!

సోమవారం తెల్లవారుజామున మక్కాలో ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని, మదీనా నగరానికి బస్సులో బయలుదేరారు.

మదీనా నగరానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండగా, వీరు ప్రయాణిస్తున్న బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఓ డీజిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. ఈ భయానక ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న మొత్తం 45 మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతుల్లో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నారని హజ్ కమిటీ అధికారులు తమ ప్రకటనలో వివరించారు.

### ఒకే కుటుంబంలో తీరని శోకం

ఈ ప్రమాదంలో మరణించిన వారిలో 18 మంది హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం ఈ విషాద తీవ్రతను రెట్టింపు చేసింది. రిటైర్డ్ రైల్వే ఉద్యోగి అయిన నజీరుద్దీన్, తన కుటుంబ సభ్యులందరితో కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ యాత్రకు వెళ్లారు. మక్కాలో ప్రార్థనలు ముగించుకుని మదీనాకు వెళ్లే మార్గమధ్యంలో వారి కుటుంబంపై విధి ఇలా పగబట్టింది. ఒకేసారి కుటుంబంలోని 18 మందిని కోల్పోవడంతో వారి బంధువులు, స్థానికులు శోకసంద్రంలో మునిగిపోయారు.

### అధికారుల స్పందన, దర్యాప్తు

ఈ యాత్రను హైదరాబాద్‌కు చెందిన నాలుగు ట్రావెల్ ఏజెన్సీలు నవంబర్ 9వ తేదీన ఏర్పాటు చేశాయి. ప్రమాద వార్త తెలియగానే సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. సౌదీ అధికారులు ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ విషాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి, పలువురు కేంద్ర మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహాలను వీలైనంత త్వరగా హైదరాబాద్‌కు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఒకే నగరం నుంచి, ముఖ్యంగా ఒకే కుటుంబం నుంచి ఇంత పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం హైదరాబాద్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది.

# తెలంగాణ స్పీకర్‌కు సుప్రీం మొట్టికాయలు

**- ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో ఆగ్రహం, 4 వారాలు గడువు**

**హైదరాబాద్/ న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు పిటిషన్లపై సుప్రీంకోర్టులో సోమవారం మరోసారి విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. “అనర్హత అంశంపై నిర్ణయం మీరు తీసుకుంటారా? మేము తీసుకోవాలా?” అని సుప్రీంకోర్టు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను గట్టిగా ప్రశ్నించింది. ఈ క్రమంలో తెలంగాణ స్పీకర్‌కు కోర్టు ధిక్కరణ కింద సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

### తెలంగాణ స్పీకర్‌కు నోటీసులు, నాలుగు వారాలు గడువు

నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులలో పేర్కొంది. అంతేకాకుండా, ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై రోజువారీగా విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్ సూచించారు. దీనికి ప్రతిస్పందనగా, స్పీకర్ తరపు లాయర్లు నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని కోర్టుకు తెలిపారు. అనంతరం, సుప్రీంకోర్టు ఈ పిటిషన్ తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. బిఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై 3 నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం జులై 31న తెలంగాణ స్పీకర్ ను ఆదేశించింది. అయితే పలు కారణాలవల్ల నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాలేదని, మరో 2 నెలలు గడువు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ శాసనసభ కార్యదర్శి దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ సీజేఐ ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ చేశారు. కేటీఆర్ దాఖలుచేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ 36వ నంబరులో ఉంది. మరో రిట్ పిటిషన్ 37వ నంబరులో లిస్ట్ అయింది. అయితే పిటిషన్లపై విచారణ చేపట్టి తేల్చేందుకు ధర్మాసనం తెలంగాణ స్పీకర్ కు 4 వారాల గడువు ఇచ్చింది.



ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ జాప్యం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ఆరోపిస్తోంది. ఏడాదిన్నర కావొస్తున్నా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకపోవడం ప్రాజస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. సుప్రీంకోర్టు సైతం అనర్హత పిటిషన్లపై మూడు నెలలు గడువు ఇచ్చినా స్పీకర్ ఎటూ తేల్చకపోవడంపై సుప్రీం ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది.

# ఉగ్రవాద గ్రూపులకు మద్దతును కొనసాగించవద్దు

**- ఉగ్రవాదులను, వారికి మద్దతిచ్చేవారిని భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని స్పష్టీకరణ**

**- అడ్డంకులు సృష్టిస్తే దీటుగా స్పందిస్తామని వెల్లడి**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్న ఉగ్రవాద గ్రూపులకు మద్దతును కొనసాగిస్తే పాకిస్థాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. ఉగ్రవాదులను, వారికి మద్దతిచ్చే వారిని భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో వ్యవహరించే విషయంలో భారత ప్రభుత్వం కొత్త విధానాలను అనుసరిస్తున్నట్లు తెలిపారు. ఉగ్ర మూఠాలను ఎగదోయడం మానకపోతే పాకిస్థాన్ అస్థిత్వమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల పురోగతి, శ్రేయస్సుపై దృష్టి పెడుతుందని అన్నారు. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, దీటుగా స్పందిస్తుందని స్పష్టం చేశారు. పాకిస్థాన్ కు ఇప్పటికే ఆపరేషన్ సిందూర్ ద్వారా 88 గంటల ట్రైలర్ చూపించామని, ఇకపై పూర్తి సినిమా చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాల ఉనికి గురించి ప్రపంచానికి ఆధారాలను అందించినట్లు తెలిపారు. చర్చలు, ఉగ్రవాదం ఎన్నటికీ కలిసి సాగవని, రక్తం, నీరు కలిసి ప్రవహించబోవని పాకిస్థాన్‌కు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. బ్లాక్‌మెయిళ్లకు పాల్పడే పరిస్థితుల్లో భారత్ లేదని, శత్రువులను ఎదుర్కోవడానికి దేశంలోని నేతలంతా ఏకతాటిపై పనిచేస్తున్నారని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌లో పరిస్థితి మెరుగుపడినట్లు చెప్పారు. చైనాతో సంబంధాలపై కూడా ఉపేంద్ర ద్వివేది స్పందించారు. ఇంతకుముందుతో పోలిస్తే చైనాతో సంబంధాలు బలపడుతున్నాయని అన్నారు. సరిహద్దుల నిర్వహణపై తాజాగా ఇరుదేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరిగాయని అన్నారు. సైనిక, దౌత్య మార్గాల్లో లోతైన చర్చలు జరిపేందుకు, సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత పరిస్థితులు కొనసాగించేందుకు ఇరుదేశాలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# వైజాగ్ స్టీల్ పై మా స్టాండ్ ఇదే.!

ఉద్యోగులపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దీంతో విపక్ష వైసీపీ రంగంలోకి దిగిపోయింది. ఉద్యోగులు తాము తీసుకుంటున్న వేతనాలకు న్యాయం చేయడం లేదని, ప్లాంట్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత వారిదేనంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. దీంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రబాబు మాటల్ని వైసీపీ వక్రీకరిస్తోందంటూ ఆదివారం వివరణ ఇచ్చారు. అయినా ఈ వివాదం చల్లారకపోవడంతో సోమవారం నేరుగా ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు వైజాగ్ స్టీల్ ప్లాంట్ పై చంద్రబాబు వ్యాఖ్యల నేపథ్యంలో తమ స్టాండ్ ఏంటో తేల్చేసింది. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ విషయంలో నెలకొన్న అపోహల నేపథ్యంలో ఏపీ సర్కార్ కీలక ప్రకటన చేసింది. ఇందులో స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరించడం లేదని స్పష్టం చేసింది. స్టీల్ ప్లాంట్ ప్రగతి వైపు ప్రస్థానం సాగిస్తుందని తెలిపింది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతం అవుతుందని పేర్కొంది. తద్వారా స్టీల్ ప్లాంట్ కు మరింత సాయం అందిస్తామని క్లారిటీ ఇచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ 17 నెలల్లోనే వైజాగ్ స్టీల్ కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.15వేల కోట్ల సాయం అందించినట్లు ప్రభుత్వం తెలిపింది. దేశంలో మరే పబ్లిక్ సెక్టార్ కంపెనీకీ ఇవ్వని స్థాయిలో ప్రభుత్వాలు వైజాగ్ స్టీల్ కు ఈ ఆర్థిక సాయం అందించినట్లు ప్రకటించింది. అలాగే ఓవరాల్ కెపాసిటీ యుటిలైజేషన్‌ను సైతం ఈ 17 నెలల్లో 48 నుంచి 79 శాతానికి పెంచినట్లు వెల్లడించింది.

# షేక్ హసీనాకు మరణశిక్ష

**- భారత కేంద్ర ప్రభుత్వం స్పందన**

- మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారని నిర్ధారణ
- ప్రస్తుతం ఢిల్లీలో ఆశ్రయం పొందుతున్న హసీనా
- హసీనాను అప్పగించాలని భారత్‌ను కోరిన బంగ్లాదేశ్ ప్రభుత్వం



ఢాకా / న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) బంగ్లాదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ, ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ (ఐసీటీ–బీడీ) మరణశిక్ష విధించింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ సోమవారం ఈ సంచలన తీర్పును వెలువరించింది. హసీనాతో పాటు మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్, మాజీ పోలీస్ చీఫ్ చౌదరి అబ్దుల్లా అల్–మామున్‌కు కూడా ఇదే శిక్ష ఖరారు చేసింది. గత ఏడాది విద్యార్థుల నేతృత్వంలో జరిగిన ఉద్యమాన్ని అణచివేయడానికి ఆదేశాలు జారీ చేశారన్న ఆరోపణలపై వీరిపై విచారణ జరిగింది. ఈ అణచివేతలో దాదాపు 1,400 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. కొన్ని నెలలుగా సాగిన ఈ విచారణ ప్రక్రియ ఈ తీర్పుతో ముగిసింది. 2024 ఆగస్టులో అధికారం కోల్పోయినప్పటి నుంచి షేక్ హసీనా ఢిల్లీలో ఆశ్రయం పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐసీటీ–బీడీ తీర్పుపై బంగ్లాదేశ్‌లోని మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం హర్షం వ్యక్తం చేసింది. దీనిని ఒక “చారిత్రక తీర్పు”గా అభివర్ణించింది. భారత్, బంగ్లాదేశ్ మధ్య ఉన్న అప్పగింత ఒప్పందం ప్రకారం షేక్ హసీనా, అసదుజ్జమాన్ ఖాన్‌లను తమకు అప్పగించాలని భారత ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రాయిటర్స్ వార్తా సంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం గతంలో చేసిన అభ్యర్థనలపై భారత్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఈ కీలక పరిణామంపై భారత విదేశాంగ శాఖ ఆచితూచి స్పందించింది. బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొంది. “పొరుగు దేశంగా, బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలకు భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. ఆ దేశంలో శాంతి, ప్రజాస్వామ్యం, సుస్థిరత నెలకొనాలని కోరుకుంటున్నాం. ఈ లక్ష్యం కోసం సంబంధిత వర్గాలతో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తాం” అని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ ప్రకటన ద్వారా భారత్ ఏ పక్షం వహించకుండా తటస్థ వైఖరిని ప్రదర్శించింది.

మరోవైపు, ఈ తీర్పును షేక్ హసీనా తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. రాయిటర్స్‌తో ఆమె మాట్లాడుతూ “ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక కాని, ఎలాంటి చట్టబద్ధత లేని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కీలుబొమ్మ ట్రైబ్యునల్ ఈ తీర్పు ఇచ్చింది. కోర్టులో నా వాదన వినిపించుకోవడానికి నాకు సరైన అవకాశం ఇవ్వలేదు. సరైన ఆధారాలను నిష్పక్షపాతంగా పరిశీలించే నిజమైన న్యాయస్థానం ముందు నాపై వచ్చిన ఆరోపణలను ఎదుర్కోవడానికి నేను భయపడను” అని ఆమె స్పష్టం చేశారు. ఈ తీర్పుతో బంగ్లాదేశ్‌లో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉండగా, హసీనా అప్పగింత విషయంలో భారత్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది అంతర్జాతీయంగా ఆసక్తికరంగా మారింది.

# బీహార్ సీఎం నితీష్ కుమార్ రాజీనామా

ఏర్పాటు చేశారు. బిహార్ సీఎం నితీష్ కుమార్ సోమవారం ఉదయం 11:30 గంటలకు మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు, ఇందులో మంత్రివర్గాన్ని రద్దు చేసే నిర్ణయం తీసుకున్నారు. సమావేశం ముగిసిన వెంటనే నితీష్ కుమార్ రాజ్ భవన్ వెళ్లి గవర్నర్‌కు తన రాజీనామాను సమర్పించారు. తరువాత బిహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతుంది. బిహార్ ప్రభుత్వ మంత్రివర్గ కార్యదర్శి విభాగం ఒక లేఖను విడుదల చేసింది.

### గాంధీ మైదానంలో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

పాట్నా జిల్లా మేజిస్ట్రేట్ నాలుగు రోజుల పాటు పాట్నాలోని గాంధీ మైదానాన్ని మూసివేయాలని ఆదేశించారు. నవంబర్ 20 వరకు గాంధీ స్టేడియంలోకి ప్రజల ప్రవేశంపై పూర్తి నిషేధం ఉంటుందని అన్నారు. నవంబర్ 20న గాంధీ మైదానంలో బిహార్ సీఎంగా నితీష్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. కనుక జిల్లా మేజిస్ట్రేట్ గాంధీ మైదానంలోకి ప్రజల ప్రవేశాన్ని నిషేధించారు. నితీష్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని మోదీ హాజరుకానున్నారని జేడీయూ నేతలు తెలిపారు.

### ప్రమాణ స్వీకార కార్యక్రమం తేదీ వెల్లడి

బిహార్ సీఎంగా నితీష్ కుమార్ రికార్డు స్థాయిలో 10వ సారి ప్రమాణం చేయనున్నారు. నితీష్ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కానున్నారు. పాట్నాలోని గాంధీ స్టేడియం వేదికగా బిహార్ లో కొత్త ప్రభుత్వం నవంబర్ 20న కొలువుదీరనుంది. మరోసారి రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పాలన కొనసాగుతుందని జేడీయూ, బీజేపీ నేతలు చెబుతున్నారు.

## ప్రజాపాలన వారోత్సవాల తర్వాతే

# స్థానిక ఎన్నికలు

తీసుకున్నారు. డిసెంబర్ రెండో వారంలో పంచాయతీ ఎన్నికలు, పరిషత్ ఎన్నికలు ఆ తర్వాత మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి కారణం డిసెంబర్ 1 నుంచి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన వారోత్సవాలు జరగనున్నాయి. 42% బీసీ కోటా విషయంలో కోర్టు స్టే ఉన్నప్పటికీ, పార్టీ వారీగా రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు జరపాలని కూడా చర్చించారు. తదుపరి న్యాయపోరాటం తర్వాత నిర్ణయం తీసుకుంటారు. కేబినెట్ భ్యటీలో రైతు భరోసా నిధుల విడుదలతో పాటు గిగ్ వర్కర్స్ బిల్‌ను కూడా ఆమోదించారు. నవంబర్ 17న జరిగిన కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, “ప్రజల పాలన కోసం ఎన్నికలు జరపాలి. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా డిసెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తాం” అని మంత్రులతో వ్యాఖ్యానించారు. తెలంగాణ హైకోర్టు అక్టోబర్ 9న జీవో 9 కు స్టే ఇచ్చింది. ఇది బీసీలకు 25% నుంచి 42%కు కోటాను పెంచినది. 50% మొత్తం కోటా నిబంధనలకు విరుద్ధంగా ఉందని కోర్టు గుర్తించింది.

పంచాయతీ ఎన్నికలు ముందుగా జరపాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ రెండో వారం (డిసెంబర్ 8–15 మధ్య)లో గ్రామ పంచాయతీలు, మండల్ ప్రజా పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు జరగనున్నాయి. అర్బన్ లోకల్ బాడీలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు తర్వాత జరుగుతాయి. 1.67 కోట్ల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. పార్టీ వారీగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కూడా చర్చించారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందుగా డిసెంబర్ 1 నుంచి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా “ప్రజాపాలన వారోత్సవాలు” జరగనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయాలను ప్రచారం చేయనున్నారు. ప్రతి గ్రామం, మండలంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొని, పాలనా విజయాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళు
్ల, రోజువారీ మంజూరు హక్కు చట్టం వంటివి వివరిస్తారు.

పథకాలు అందని వారి దగ్గర నుంచి అర్జీలు స్వీకరిస్తారు. “ప్రజాపాలన వారోత్సవాలు ప్రజలతో మా బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయి. ఎన్నికల్లో ప్రజలు మా పాలనకు మద్దతు ఇస్తారు” అని రేవంత్ విశ్వాసంతో ఉన్నారు. ఈ వారోత్సవాల తర్వాతే ఎన్నికలు జరపాలని, ఇది ప్రజల్లో ఎన్నికల ఉత్సాహాన్ని పెంచుతుందని కాంగ్రెస్ నేతలు కూడా భావిస్తున్నారు. గతంలో ఎన్నికల నోటిఫికేషన్ తెలంగాణ ఎస్ఈవో విడుదల చేశారు. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో దానికి సంబంధించిన జీవోపై స్టే రావడంతో ఎన్నికల ప్రక్రియ కూడా ఆగిపోయింది. రిజర్వేషన్లు రివైజ్ చేసి మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. ఈ అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన రామలింగేశ్వర స్వామి

తాండూరు, : వికారాబాద్ జిల్లా తాండూరు మండలం వీరారెడ్డిపల్లి, జిన్గుర్తిలోని ఆలయాల్లో భక్తులు కార్తిక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వీరారెడ్డిపల్లిలో భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరునికి, జినుగుర్తిలో రామలింగేశ్వరునికి భక్తులు దీపాలు వెలిగించి హారతులు ఇచ్చారు. రామలింగేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శివకుమార్ భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

## చలికి వణకకుండా.. బల్దియా అండ

అమీర్‌పేట, : నగరంలో చలిపంజా విసురుతోంది. ఇప్పటికే పలుచోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో నగరంలోని నిరాశ్రయులు, వీధుల వెంట నిద్రించేవారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధికోసం నగరానికి వచ్చినవారు ఆర్థిక స్థోమతలేక రహదారులు, వీధులవెంట నిద్రకు ఉపక్రమిస్తుంటారు. ఇలాంటి నిరాశ్రయుల కోసమే పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి జీహెచ్ఎంసీ ఆధార్‌కార్డు చూపిస్తే భోజనంతో కూడిన వసతిని ఉచితంగా అందిస్తోంది.

## ఇస్త్రీ పెట్టెలో దాచిన బంగారం పట్టివేత

ఇబ్రహీంపట్నం, : షార్జా నుంచి ఇస్త్రీ బాక్సులో తీసుకొచ్చిన 1200 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్ట్ అధికారుల కథనం ప్రకారం.. వైఎస్ఆర్ కడప జిల్లా పొద్దుటూర్‌కు చెందిన వ్యాపారి షార్జాకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో 1200 గ్రాముల బరువు గల 11 బంగారం బిస్కెట్లను ఇస్త్రీ పెట్టెలో అమర్చాడు. రహస్యంగా విమానం శంషాబాద్‌కు తెచ్చాడు. కస్టమ్స్ అధికారుల తనిఖీలను తప్పించుకొని గ్రీన్ ఛానల్ నుంచి బయటకు వెళ్లిపోయాడు. అతని సామగ్రి అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీలు చేయగా అక్రమ బంగారం తరలింపు గుట్టురట్టయింది.

## రూ.1 లక్షకు ఏడాదికి పోస్టాఫీసు నుంచి 10 పథకాలు

ఈ ఏడాది 2025లో చాలా బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలు వడ్డీ రేట్లను భారీగా




తగ్గించాయి. దీని ఫలితంగా తక్కువ వడ్డీకే డిపాజిట్లు చేయాల్సి వస్తోంది. ఇప్పుడు డిపాజిట్ చేయాలనుకుంటున్న వారికి సైతం తక్కువ వడ్డీ రేట్లే వస్తాయి. ఇలాంటి పరిస్థితుల్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి దిగ్గజ బ్యాంకుల్లోని వడ్డీ రేట్ల కంటే ఎక్కువ వడ్డీ రేట్లు ఆఫర్ చేస్తోన్న పోస్టాఫీస్ చిన్న మొత్తాల పొదుపు పథకాలు బెస్ట్ ఆప్షన్‌గా చెప్పవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వ రంగ బ్యాంకులు సహా చాలా పెద్ద బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లు 6-7 శాతం వరకే ఉన్నాయి. మరోవైపు పోస్టాఫీస్ స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్‌లో 7 శాతానికి పైగా వడ్డీ రేట్లు ఉన్నాయి. అలాగే పాత పన్ను విధానంలో ఈ స్కీమ్స్ ద్వారా ట్యాక్స్ మినహాయింపులు సైతం పొందవచ్చు. చాలా వరకు దిగ్గజ బ్యాంకుల్లోని ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల కంటే పోస్టాఫీస్ పొదుపు పథకాలు బెట్టర్ రిటర్న్స్ ఇస్తున్నాయి. అయితే, పోస్టాఫీస్ పథకాల వడ్డీ రేట్లను ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం సమీక్షిస్తుంది. కొన్నిసార్లు పెంచడం లేదా తగ్గించడం చేస్తుంది. లేదా యథాతథంగా కొనసాగిస్తుంటుంది. ప్రస్తుతం పోస్టాఫీసు పథకాల్లో చాలా పథకాలకు 7 శాతానికి పైగా వడ్డీ వస్తోంది. మరి ఆ పథకాలు ఏవి, అందులో రూ.1 లక్ష డిపాజిట్ చేసినట్లయితే ఏడాది చొప్పున చేతికి ఎంత వడ్డీ లభిస్తుంది? వడ్డీ ఎప్పుడెప్పుడు చెల్లిస్తారు?

## మళ్లీ తెరపైకి ప్రభుత్వ బ్యాంకుల విలీనం



ప్రభుత్వ బ్యాంకుల విలీనంపై కొద్ది రోజులుగా విస్తృతంగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. మరోసారి మెగా బ్యాంకుల విలీనం ఉంటుందని చర్చలు నడుస్తున్నాయి. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా దీనిపై మాట్లాడారు. బ్యాంకుల విలీనం , ప్రైవేటీకరణ మంచిదేనని అన్నారు. అంతర్జాతీయ బ్యాంకులుగా ఎదగాలంటే పెద్ద బ్యాంకులు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న బ్యాంకులతోనే ఇది సాధ్యం కాదని చెప్పారు. దీంతో మరోసారి విలీనం జరగక తప్పదని.. అప్పుడే పెద్ద బ్యాంకులుగా ఏర్పడే అవకాశం ఉందని చెప్పకనే చెప్పారు. దీంతో మరోసారి విలీనం ప్రక్రియ గురించి ఊహాగానాలు జోరందుకున్నాయి. 2020 లో అప్పుడు చిన్న ప్రభుత్వ బ్యాంకుల్ని పెద్ద బ్యాంకుల్లో విలీనం చేశారు. ఇప్పుడు మలివిడత విలీన ప్రక్రియకు కేంద్రం సిద్ధమైనట్లే తెలుస్తోంది. ఇప్పుడు 12 ప్రభుత్వ బ్యాంకుల్ని.. 8 కి పరిమితం చేసే యోచనలో ఉందని సమాచారం. తాజాగా పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల విలీనంపై అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. ఎస్బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. బహిరంగంగానే మద్దతు ప్రకటించారు. మరోసారి విలీనం జరిగితే మంచిదేనని అభిప్రాయపడ్డారు. అప్పటికి కూడా చిన్న బ్యాంకులు మనుగడలోనే ఉంటాయని ఒక ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఎస్బీఐ ఇప్పటికే దిగ్గజ బ్యాంకుగా ఉన్నప్పటికీ.. మార్కెట్లో తన వాటాను మరింత పెంచుకునే విషయంలో రాజీ పడట్లేదని శెట్టి స్పష్టం చేశారు. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం సహా అంతర్జాతీయ స్థాయిలో పోటీని తట్టుకునేలా చేయడం కోసం కేంద్రం.. 2017 నుంచి విలీనాల్ని ప్రారంభించింది. ఈ క్రమంలోనే ప్రస్తుతం ప్రభుత్వ బ్యాంకుల సంఖ్య గతంలో 27 గా ఉండగా.. 12కు తగ్గాయి. 2020లోనే చూస్తే.. 10 చిన్న ప్రభుత్వ బ్యాంకులు 4 పెద్ద బ్యాంకులుగా మారాయి. ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. పంజాబ్ నేషనల్ బ్యాంకులో కలిశాయి. సిండికేట్ బ్యాంకు.. కెనరా బ్యాంకులో విలీనమైంది. ఆంధ్రా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనమైంది. అలహాబాద్ బ్యాంకు.. ఇండియన్ బ్యాంకులో విలీనమైంది. దానికి ముందు 2017-19లో విజయా బ్యాంకు, దేనా బ్యాంకు.. బ్యాంక్ ఆఫ్ బరోడాలో కలిశాయి. ఇప్పుడు విలీన పరిశీలనలో ఉన్న బ్యాంకుల విషయానికి వస్తే.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో.. బ్యాంక్ ఆఫ్ ఇండియాను విలీనం చేసేందుకు ప్రతిపాదన సిద్ధమవుతోంది.

## బీఎస్ఎన్ఎల్ స్టూటెండ్ స్పెషల్ ప్లాన్ ..




ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ అత్యంత చౌకైన ప్లాన్స్ అందిస్తూ మొబైల్ ఫోన్ వినియోగదారులను ఆకర్షిస్తోంది. ప్రత్యర్థి టెలికాం సంస్థలకు గట్టి పోటీ ఇస్తోంది. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ప్లాన్స్ తీసుకొస్తూ ఔరా అనిపిస్తోంది. చాలా తక్కువ ధరకే భారీగా డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్ ఇస్తుండడం గమనార్హం. దీంతో చాలా మంది బీఎస్ఎన్ఎల్‌కి మారిపోతున్నారు. ఇప్పుడు మరోసారి కొత్త తరహా ప్లాన్ ప్రకటించింది. అదే బీఎస్ఎన్ఎల్ స్టూడెంట్ స్పెషల్ ప్లాన్ . కేవలం రూ.251తో రీఛార్జ్ చేసుకుంటే సరిపోతుందని చెబుతోంది. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించింది. బీఎస్ఎన్ఎల్‌తో చదువుకోండి, వీడియోలు స్ట్రీమింగ్ చేయండి, విజయం సాధించండి అంటూ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేసింది. బీఎస్ఎన్ఎల్ స్టూటెండ్ స్పెషల్ ప్లాన్ పేరుతో పరిమిత కాల రీఛార్జ్ ప్లాన్ ప్రకటించింది. రూ.251గా ఈ ప్లాన్ ధరను నిర్ణయించింది. ఈ స్టూడెంట్ ప్లాన్ ద్వారా 28 రోజుల వ్యాలిడిటీ అందిస్తోంది. అలాగే 100 జీబీ డేటాతో పాటుగా అన్‌లిమిటెడ్ కాల్స్ వస్తాయి. అలాగే రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు 28 రోజుల పాటు లభిస్తాయి. జియో, ఎయిర్‌టెల్, వీఐ వంటి టెలికాం కంపెనీలు కనీస రీఛార్జ్ ప్లాన్స్ రూ.300 పైన ఉంటుండగా నెల రోజుల పాటు రూ.251కే భారీగా డేటా, అపరిమిత కాల్స్ అందిస్తుండడం గమనార్హం. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకునేందుకు లిమిటెడ్ టైమ్ ఉంటుంది. నవంబర్ 14, 2025 రోజున లాంచ్ చేసిన ఈ స్టూడెంట్ స్పెషల్ ప్లాన్ డిసెంబర్ 14, 2025 వరకే అందుబాటులో ఉంటుంది. ఆ లోపు రీఛార్జ్ చేసుకున్న వారికే 28 రోజుల వ్యాలిడిటీతో 100జీబీ డేటా, అపరిమిత కాల్స్ వస్తాయని చెప్పవచ్చు. పరీక్షల కాలం మొదలవుతున్న క్రమంలో విద్యార్థలకు ఈ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతుందని బీఎస్ఎన్ఎల్ పేర్కొంది. అవసరమైన మేర డేటా ఉండడంతో మొబైల్ ద్వారా చదువుకునేందుకు వీలుకలుగుతుందని తెలిపింది. మరోవైపు.. బీఎస్ఎన్ఎల్ పండగల సమయంలో ప్రత్యేకంగా రూ.1 ప్లాన్ తెచ్చిన సంగతి తెలిసిందే. గత దీపావళికి సైతం రూ.1 ప్లాన్ ప్రకటించింది. ఈ ప్లాన్ ద్వారా ఉచితంగా సిమ్ ఇవ్వడంతో పాటు 30 రోజుల పాటు వ్యాలిడిటీతో రోజుకు 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్, రోజు వారీగా 100 ఎస్ఎంఎస్‌లు అందించింది. అయితే, ఇది కొత్తగా సిమ్ కార్డు తీసుకునే వారికే వర్తిస్తుంది. కానీ, ఇప్పుడు ప్రకటించిన స్టూడెంట్ ప్లాన్ చాలా మందికి ఉపయోగపడుతుందని చెప్పవచ్చు.

## ఫ్లిప్‌కార్ట్‌లో కొనసాగుతున్న ఫిట్‌నెస్ కార్నివల్ సేల్




టెక్నాలజీ మన జీవితంలో అంతర్భాగంగా మారిన ఈ రోజుల్లో, ఆరోగ్యంపై శ్రద్ధ కూడా అదే స్థాయిలో పెరిగింది. మన ఫిట్‌నెస్‌ను, ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకునేందుకు స్మార్ట్‌వాచ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అలాంటి వారి కోసమే ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ 'ఫిట్‌నెస్ కార్నివాల్' పేరుతో ప్రత్యేక సేల్‌ను నిర్వహిస్తోంది. నవంబర్ 14న ప్రారంభమైన ఈ సేల్, నేటితో ముగియనుంది. ఈ సేల్‌లో భాగంగా ఆపిల్, సామ్‌సంగ్, గార్మిన్ వంటి టాప్ బ్రాండ్ల స్మార్ట్‌వాచ్‌లపై కనీవినీ ఎరుగని డిస్కౌంట్లను అందిస్తోంది. ఈ ఆఫర్లకు అదనంగా ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులపై ప్రత్యేక తగ్గింపులు, 9 నెలల వరకు నో-కాస్ట్ ఈఎంఐ సౌకర్యం, పాత డివైజ్‌ల ఎక్స్చేంజ్‌పై అదనంగా రూ.300 వరకు డిస్కౌంట్ వంటి ప్రయోజనాలు కూడా ఉన్నాయి. %జుజ+%, బ్లడ్ ఆక్సిజన్ మానిటరింగ్, స్లీప్ ట్రాకింగ్, జీపీఎస్ వంటి అధునాతన ఫీచర్లతో వస్తున్న ఈ స్మార్ట్‌వాచ్‌లు మీ ఫిట్‌నెస్ ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తాయి.

## తాజా ఆంక్షలకు ముందుగా రూ. 26,000 కోట్ల రష్యా చమురు కొనుగోళ్లు




ఈ ఏడాది అక్టోబరులో పాశ్చాత్య దేశాలు తాజా ఆంక్షలు విధించడానికి ముందు.. రష్యా నుంచి భారత్ 2.5 బిలియన్ యూరోల (దాదాపు రూ.26,000 కోట్ల) విలువైన ముడి చమురు కొనుగోలు చేసిందని ఐరోపా పరిశోధనా సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) వెల్లడించింది.

అక్టోబరులో రష్యా చమురు సంస్థల నుంచి చమురు అధికంగా కొనుగోలు చేయడంలో చైనా తర్వాత స్థానంలో భారత్ ఉందని పేర్కొంది. రష్యాకు చెందిన అతి పెద్ద ఇంధన ఉత్పత్తి సంస్థలు రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్‌పై అమెరికా అక్టోబరు 22న ఆంక్షలు విధించింది. అక్టోబరులో రష్యా 60 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురును ఎగుమతి చేయగా.. అందులో రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్ సంస్థలే 45 మిలియన్ బ్యారెళ్లను సరఫరా చేశాయి. అమెరికా తాజా ఆంక్షల తరవాత రిలయన్స్, హెచ్‌పీసీఎల్-మిత్తల్ ఎనర్జీ లిమిటెడ్, మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ సంస్థలు చమురు దిగుమతులను తాత్కాలికంగా నిలిపివేశాయి. అక్టోబరులో రష్యా నుంచి మొత్తం 3.1 బిలియన్ యూరోల (దాదాపుగా రూ.32,000 కోట్ల) విలువైన ఇంధన ఉత్పత్తులను భారత్ దిగుమతి చేసుకుంది. ఇందులో 81% (2.5 బి.యూరోల) ముడి చమురు కాగా, 11% (351 మిలియన్ యూరోల - రూ.3,600 కోట్ల) బొగ్గు, 7% చమురు ఉత్పత్తులు (222 మి.యూరోలు-సుమారు రూ.2,300 కోట్లు) ఉన్నాయి.

## గ్రో దూకుడు..లక్ష కోట్లకు మార్కెట్ విలువ



పముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ గ్రో మాతృ సంస్థ బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ షేర్లు స్టాక్ మార్కెట్‌లో దూసుకెళుతున్నాయి. గత వారం స్టాక్ మార్కెట్‌లో లిస్టయిన ఈ కంపెనీ.. వరుసగా నాలుగో రోజూ లాభాల్లో కొనసాగుతోంది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి ఎన్ఎస్ఈలో మరో 13 శాతం లాభంతో 168 వద్ద సరికొత్త గరిష్ఠాల వద్ద ట్రేడవుతోంది. ఈ క్రమంలోనే కంపెనీ మార్కెట్ విలువ రూ.1లక్ష కోట్ల మార్కు దాటింది. బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ షేర్లు గత బుధవారం 14 శాతం ప్రీమియంతో మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇష్యూ ధర రూ.100తో పోలిస్తే.. ఎన్ఎస్ఈలో 12 శాతం ప్రీమియంతో రూ.112 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి. అదేరోజు 128.85 వద్ద క్లోజ్ అయ్యాయి. లిస్టింగ్ తర్వాత కంపెనీ షేర్లు దాదాపు 46 శాతం పెరిగాయి. రూ.6,632 కోట్ల నిధుల సమీకరణలో భాగంగా ఈనెల 4న పబ్లిక్ ఇష్యూకు వచ్చిన ఈ కంపెనీ.. ధరల శ్రేణిని రూ.95-100గా కంపెనీ నిర్ణయించింది. మొత్తం 17.60 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. 2016లో ప్రారంభమైన గ్రో.. దేశంలోనే అతిపెద్ద స్టాక్ బ్రోకర్‌గా ఉంది. 2025 జూన్‌కు కంపెనీకి 26 శాతానికి పైగా మార్కెట్ వాటా ఉంది.

## మహారాష్ట్రలో స్కూల్ ఆలస్యం కారణంగా ఆరు తరగతి బాలిక మృతి

ముంబై: స్కూల్‌కు ఆలస్యంగా వచ్చిందని ఒక విద్యార్థిని పట్ల పాఠశాల యాజమాన్యం కఠినంగా ప్రవర్తించింది. ఆ విద్యార్థిని చేత 100 గుంజిలు తీయించారు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన బాలిక వారం రోజులుగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. ఈ విషాద ఘటన మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో చోటుచేసుకుంది. పాల్ఘర్ జిల్లాలోని ఓ ప్రైవేట్ స్కూల్లో చదువుతున్న నలుగురు విద్యార్థినులు నవంబర్ 8న ఆలస్యంగా పాఠశాలకు చేరుకున్నారు. స్పందించిన స్కూల్ యాజమాన్యం వారిపై అమానవీయంగా ప్రవర్తించింది. అందులో ఒక విద్యార్థిని తీవ్రంగా ప్రభావితమై, తల్లిదండ్రులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. వాస్తవానికి, చికిత్స పొందుతూ బాలిక ప్రాణాలు కోల్పోయింది. తల్లి ఆరోపణల ప్రకారం, పుస్తకాల బ్యాగ్ ను ఉంచి 100 గుంజిలు తీయించడం వల్ల బాలిక వెన్నెముకకు గాయపడ్డది. దీంతో నడవలేని స్థితికి చేరిపోయింది. తల్లి, ఈ ఘటనకు కారణమైన టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఈ ఘటనను సీరియస్‌గా పరిగణించిన విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణకు ఆదేశించారు.

## మళ్లీ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ .. పదవుల పంపకానికి కొత్త ఫార్ములా

న్యూఢిల్లీ: బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించింది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 89 సీట్లతో గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించింది. జేడీయూ 85 సీట్లు కైవసం చేసుకుంది. ఎల్‌జేపీ (రాం విలాస్) 19 సీట్లు దక్కించుకోగా.. ఇతరులు 9 సీట్లు గెలిచారు. దీంతో మొత్తంగా 202 సీట్లుతో సునాయాసంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఎన్డీయే కూటమికి అవకాశం లభించింది. అయితే తదుపరి బిహార్ సీఎం ఎవరు అవుతారని సర్వత్రా చర్చ జరిగింది. నీతీశ్ కుమార్ మళ్లీ ముఖ్యమంత్రిగా ఉంటారని కొందరు అంటే.. మరికొందరు ఈ సారి మార్పులు ఉండచ్చేమో అని అభిప్రాయపడ్డారు. అయితే అందరి నిరీక్షణకు తెరదించుతూ బిహార్ సీఎం అభ్యర్థిని ఎన్డీఏ కూటమి ఫైనలైజ్ చేసినట్లు సమాచారం. మళ్లీ నీతీశ్ కుమార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే ప్రభుత్వంలో బీజేపీ కీలకంగా మారనుందని సమాచారం. నీతీశ్ కుమార్ సీఎంగా పట్నా మైదానంలో నవంబర్ 19 లేదా 20 తేదీలలో కొత్త ప్రభుత్వం కొలువు తీరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం గాంధీ మైదానంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇక ప్రధాని షెడ్యూల్ బట్టి తేదీని నిర్ణయించనున్నట్లు తెలుస్తోంది. సోమవారం (నవంబర్ 17) జరగనున్న మంత్రివర్గ సమావేశంలో అసెంబ్లీ రద్దుకు ఆమోదం తెలిపి.. ఆ తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత నీతీశ్ తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పిస్తారు. తద్వారా కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు ఏర్పాట్లు చేస్తారు.

## ఆర్థికాభివృద్ధిలో పారిశ్రామికవేత్తలే కీలకం..

ఆర్థిక వృద్ధి, ఉద్యోగ కల్పన, సాంకేతిక ఆవిష్కరణల పురోగతి వెనుక ఉన్న చోదక శక్తి పారిశ్రామిక వేత్తలు అని గుర్తించాలి. భారతదేశంలో పారిశ్రామితవేత్తల లేదా వ్యవస్థాపకుల లేదా వ్యాపారవేత్తల లేదా ఎంటర్‌ప్రూనర్స్ ఆవిష్కరణలు, వారు ప్రదర్శించే మానసిక ధైర్యం, దేశ ఆర్థికాభివృద్ధిలో వారి భాగస్వామ్యం, తమ ఉత్పత్తులతో ప్రజల జీవనశైలినా సులభతరం చేయడం లాంటి ప్రధాన బాధ్యతలను నిర్వహిస్తున్నారు. నూతనంగా స్టార్ట్‌ఆప్‌లను స్థాపించి, బాలారిష్టాలను అధిగమించి, సవాళ్లకు సవాళ్లు విసిరి తమదైన శైలిలో పరిశ్రమలను గాడిలో పెట్టి , వందల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధిని కల్పించి, లాభాల పంటలను పండిస్తూ, దేశ సుస్థిరాభివృద్ధిలో పాలు పంచుకుంటున్న పారిశ్రామికవేత్తలు దేశానికి వ్యవసాయం తర్వాత స్థానాన్ని ఆక్రమించి, గౌరవ ప్రదంగా సమాజంలో గుర్తింపు పొంది మనకు ఆదర్శంగా నిలుస్తున్నారు. దేశాభివృద్ధిలో పారిశ్రామికవేత్తల పాత్రను గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 18 నవంబర్ రోజు "జాతీయ పారిశ్రామికవేత్తల దినోత్సవం (నేషనల్ ఎంటర్‌ప్రూనర్స్ డే)" పాటించడం 2010 నుంచి ఆనవాయితీగా మారింది. చిన్న మొత్తంలో పరిశ్రమలను స్థాపించి, వ్యాపారాలను పెంచుకుంటూ, మార్పులకు అనుగుణంగా తాము మారుతూ, భవిష్యత్తు నాయకులకు స్ఫూర్తినిస్తూ, నూతన ఆవిష్కరణలకు పెద్ద పీట వేస్తూ, ఆర్థిక సామాజిక ప్రగతిలో మద్దతునిస్తూ ఎంటర్‌ప్రూనర్స్ శక్తివంతమైన స్థాయికి చేరుతూ, దేశాన్ని అగ్రభాగాన నిలుపుతూ ఎంతో మేలును చేస్తున్నారు. శూన్యం నుంచి ఒక సామ్రాజ్యాన్ని నిర్మించిన వ్యక్తులు సామాన్యులు కాదు, అసాధారణ ఘనులు అని అభివర్ణించాలి. చిన్న వ్యాపార యజమానుల నుంచి టెక్ స్టార్టప్ వ్యవస్థాపకుల వరకు అందరూ తమ మేధస్సుకా పని పెట్టి పౌర సమాజ ఆలోచనలకు అనుగుణంగా తమ ఉత్పత్తులను రూపొందిస్తూ మన జీవితాలను సులభతరం చేస్తున్నారు. పారిశ్రామికవేత్తలు కేవలం కంపెనీ పెట్టడమే కాకుండా ఉద్యోగ ఉపాధులను కల్పించడం ఒక ముఖ్య అంశంగా గమనించాలి. ఈ దినోత్సవ వేదికగా వర్ధమాన, అనుభవజ్ఞులైన పారిశ్రామితవేత్తలకు అనువుగా వాతావరణాన్ని కల్పించడం, రుణాల రూపంలో ఆర్థిక చేయూత ఇవ్వడం, పరిశ్రమల స్థాపనకు చవకగా స్థలాలను కేటాయించడం లాంటి చర్యలను చర్చించడం జరుగుతుంది. పారిశ్రామికవేత్తల కీలక సహకారాల్లో ఉద్యోగ ఉపాధుల కల్పన, ఆధునిక సాంకేతిక ఆవిష్కరణలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను బలపరచడం, పోటీతత్వాన్ని పెంచడం, నాణ్యతకు పెద్ద పీట వేయడం, పురోగతిలో భాగం కావడం లాంటివి ప్రధాన అంశాలుగా పేర్కొనబడ్డాయి. ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ ఎంటర్‌ప్రూనర్స్ జాబితాలో థామస్ ఎడిసన్, హెన్రీ ఫోర్డ్, ఓప్రా విన్‌ఫ్రే, సామ్ వాల్టన్, స్టీవ్ జాబ్స్, బిల్ గేట్స్ లాంటి ఎందరో మహామహులు ఉన్నారు. భారత్‌లో అత్యుత్తమ పారిశ్రామితవేత్తల జాబితాలో రితేశ్ అగర్వాల్, ఫాల్గుని నాయర్, కిరణ్ మజుందార్, ధీరూభాయ్/ముఖేశ్ అంబానీ, సచిన్ బన్సల్, అజిమ్ ప్రేమ్ జీ, కునాల్ షా, నారాయణ మూర్తి, రతన్ టాటా, ఆనంద్? మహీంద్రా, దీపిందర్ గోయల్, లక్ష్మీమిట్టల్ లాంటి ప్రముఖులు చాలా మంది ఉన్నారు. జాతీయ పారిశ్రామితవేత్తల దినోత్సవం వేదికగా కార్యశాలల నిర్వహణ, వ్యాపారవేత్తలకు మద్దతు, విజయగాథలను చర్చించడం, ఎంటర్‌ప్రూనర్ విద్యను ప్రోత్సహించడం, సోషల్ మీడియాల్లో ప్రచారం రూపంలో పాల్గొనడం, మహిళా పారిశ్రామితవేత్తలకు చేయూత ఇవ్వడం లాంటి పలు కార్యక్రమాలను నిర్వహించవచ్చు. ఇన్ఫోసిస్ అధినేత నారాయణ మూర్తి ప్రారంభంలో వారి సతీమణి ఇచ్చిన పది వేల రూపాయల పెట్టుబడితో ఒక రూపంలో ప్రారంచించిన టెక్ కంపెనీ నేడు 3.23 లక్షల ఉద్యోగులతో 1.63 లక్షల కోట్ల టర్నోవర్‌తో ప్రపంచ స్థాయిలో అగ్రభాగాన నిలవడం చూస్తున్నాం.

## అక్రమంగా తరలిస్తున్న 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టివేత



ఆదిలాబాద్, : వేమనపల్లి మండలంలోని నాగారం నుండి మహారాష్ట్ర లోని సిరొంచకు అక్రమంగా తరలిస్తున్న 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసునమోదు చేసినట్లు నీల్వాయి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నాగారం నుండి వస్తున్న వాహనంలో 7 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో మంచిర్యాలలోని ఎన్టీఆర్ నగర్ కు చెందిన చింతల రమేష్ పట్టుబడ్డాడు. అనంతరం వాహనాన్ని సీజ్ చేసి అతని పై కేసు నమోదు చేసి వాహనాన్ని నీల్వాయి పోలీస్ స్టేషన్ కు తరలించారు. మండలంలో ఎవరైనా రేషన్ బియ్యాన్ని అమ్మిన, కొనుగోలు చేసిన, అక్రమ రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

## ఈనెల 23న ఉట్నూర్ లో భారీ బహిరంగ సభ

బోథ్, : రాజ్యాంగ విరుద్ధంగా ఎస్టీ జాబితాలో కొనసాగుతున్న లంబాడాలను తొలగించాలని తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్ డిమాండ్ చేశారు. ఈనెల 23న ఉట్నూర్ లోని ఎంపీడీవో గ్రౌండ్స్‌లో ఆదివాసి సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆదిలాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆదివాసులకు అందవలసిన ఫలాలను వలస లంబాడాలు అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## హై టెన్షన్ విద్యుత్ వైర్లు తొలగించాలి

నిర్మల్, : సోన్ మండలం పాక్పట్ల గ్రామంలో ఇళ్ల మధ్యలో ఉన్న 11 కెవి హై టెన్షన్ విద్యుత్ వైర్లను తొలగించాలని కోరుతూ వడ్డెర కులస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. గత 35 ఏళ్లుగా గ్రామంలో పూరి గుడిసెలు వేసుకుని జీవిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినా, హై టెన్షన్ వైర్ల వల్ల ఇళ్ల నిర్మాణం నిలిచిపోయిందని వారు తెలిపారు. అధికారులు స్పందించి వైర్లను తొలగించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## కలెక్టర్ క్యాంపు కార్యాలయం నిర్మాణానికి భూమి పూజ

ఖానాపూర్, : జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమి పూజ చేశారు. రూ.8.10 కోట్లతో 5.38 ఎకరాల విస్తీర్ణంలో ఈ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులపై అధికారులతో సమీక్షించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రాంనాథ్ పాల్గొన్నారు.

## బీసీల ఎదుగుదలపై ప్రొఫెసర్ హరికృష్ణతో చర్చ

ముథోల్,: నిర్మల్ జిల్లా కేంద్రానికి సోమవారం విచ్చేసిన ప్రొఫెసర్ హరికృష్ణకు బీసీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో బీసీల స్థితిగతులు, సామాజిక, రాజకీయ, ఆర్థిక ఎదుగుదలపై చర్చించారు. బీసీలంతా ఐక్యంగా ఉండి ముందుకెళ్లాలని ప్రొఫెసర్ హరికృష్ణ సూచించారు. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ కొట్ట శేఖర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మేడారం ప్రదీప్, అపర్ణ, స్వామి గౌడ్, శ్రీనివాస్, బెజ్జారం ప్రదీప్, వస్త్రాల ప్రసాద్, కిషోర్లు పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఒకరు మృతి



కరీంనగర్, : పెద్దపల్లి పట్టణ పరిధి బంధంపల్లిలోని రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. బంధంపల్లి వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఓ కారు ఢీ కొట్టడంతో బైకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలికి చేరుకున్న పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్ ట్రాఫిక్కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## యాక్సిడెంట్.. నలుగురు పిల్లల తండ్రి మృతి

మానకొండూరు, : కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో తాడికల గ్రామానికి చెందిన గడ్డి గట్టయ్య (60) మృతి చెందారు. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి ఎన్ హెచ్563 దాటుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో గట్టయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై గట్టయ్య అక్కడికక్కడే మరణించారు. మృతుడికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## మొత్తం 149 దరఖాస్తుల రాక: ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

చొప్పదండి, : రాజన్న సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ప్రజావాణికి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజల నుంచి 149 దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ, హౌసింగ్, డీఆర్డీఏ, విద్య, సంక్షేమ శాఖలతో పాటు పలు శాఖలకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు అందాయి. అన్ని దరఖాస్తులను ఆన్లైన్లో పూర్తిగా పరిష్కరించాలని, పెండింగ్ పెట్టవద్దని, అధికారులు తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని స్పష్టం చేశారు. నూతన వైద్యశాలలు, అంగన్వాడీలు, పాఠశాలల భవనాలకు మిషన్ భగీరథ నీటి, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని, ఆధార్ కార్డు కోసం ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు త్వరితగతిన జనన ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

## స్వామివారి సేవలో ప్రముఖులు

వేములవాడ, : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి వారిని మణిపూర్ సబ్-కలెక్టర్ విద్యామారి శ్రీధర్ ఐఏఎస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఆయనకు స్వాగతం పలికి ఆలయ విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారి వెంట ఆలయ సిబ్బంది కూడా ఉన్నారు.

## రాజన్న సిరిసిల్లలో ప్రజావాణి: 149 అర్జీలు స్వీకరణ

సిరిసిల్ల, : రాజన్న సిరిసిల్లలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మొత్తం 149 దరఖాస్తులను స్వీకరించారు. అన్ని శాఖలు తమకు వచ్చిన అర్జీలను సకాలంలో ఆన్లైన్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ (43), హౌసింగ్ (35) విభాగాలకు అత్యధిక దరఖాస్తులు వచ్చాయి. పాఠశాలలు, అంగన్వాడీలకు నీరు, విద్యుత్ కనెక్షన్లు కల్పించాలని, విద్యార్థులకు బర్త్ సర్టిఫికెట్లు త్వరగా ఇవ్వాలని కూడా సూచించారు.

## శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్త జన సందోహం

హుజూరాబాద్, : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి దర్శనానికి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, ప్రాంగణం, క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని దర్శించుకున్న భక్తులు.. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిశ్రద్ధలతో కార్తిక దీపాలు వెలిగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మహిళకు ప్రసవం చేసి.. శిశువుకు ఊపిరి పోసి

కరీంనగర్, : వీణవంకకు చెందిన 108 సిబ్బంది ఓ గర్భిణికి అంబులెన్స్‌లో ప్రసవం చేయడంతోపాటు నవజాత శిశువుకు ఊపిరి పోశారు. 108 సిబ్బంది తెలిపిన ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన చిర్రకుంట మౌనికను మొదటి కాన్పు నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉందని హనుమకొండకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో హుజూరాబాద్‌కు (దీని పరిధి ఇక్కడి వరకే) తీసుకొచ్చారు. ఇక్కడి నుంచి వీణవంకకు చెందిన 108 అంబులెన్స్‌లో హనుమకొండకు తీసుకెళ్తుండగా.. గర్భిణికి నొప్పులు ఎక్కువయ్యాయి. అందులో ఉన్న సిబ్బంది స్పందించి ప్రసవం చేసేందుకు యత్నించగా.. బిడ్డ చేతులు బయటకు వచ్చి తల రాలేదు. సిబ్బంది నేర్పుతో ప్రసవం చేయగా పాప పుట్టింది. పాపలో కదలికలు లేకపోవడంతో.. సిబ్బంది సీపీఆర్ నిర్వహించగా కదలింది. అనంతరం తల్లీబిడ్డలను హనుమకొండ జిల్లా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో చేర్చారు.

## అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ ను సందర్శించారు

పాలేరు, : సోమవారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ ను అడిషనల్ డీసీపీ లా అండ్ఆర్డర్ ప్రసాద్ రావు సందర్శించారు. ఆయన పోలీస్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, సిసిఎన్టిఎస్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడి, పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులను కూడా పరిశీలించారు.

## ఉపాధి కార్మికులకు పనిముట్లు పంపిణీ

ఖమ్మం, : అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులకు పంచాయతీ సెక్రటరీ కార్తీక్ ఆధ్వర్యంలో సోమవారం పలుగులు, పారలు, తట్టలు పంపిణీ చేశారు. గ్రామాభివృద్ధికి అందరి సహకారం అవసరమని, పంచాయతీ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని సెక్రటరీ కార్తీక్ కోరారు. ఈ పంపిణీ కార్యక్రమం ద్వారా కార్మికులకు పని సులభతరం అవుతుందని భావిస్తున్నారు.


## కులగణన సర్వే సిబ్బందికి రేమ్యూనరేషన్ విడుదల చేయాలి: టిపిటిఎఫ్

మధిర, : ఆళ్లపల్లి మండలంలోని ప్రభుత్వగిరిజన ప్రాథమిక పాఠశాల ముత్తా పురంలో జరిగిన సమావేశంలో టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ.రాంబాబు మాట్లాడుతూ, కులగణన సర్వే నిర్వహించిన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు నేటి వరకు రేమ్యూనరేషన్ అందలేదని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయాన్ని కేటాయించి బాధ్యత నిర్వర్తించినా, వారికి ఇవ్వాల్సిన రేమ్యూనరేషన్ విడుదల కాకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొమరం.లాలయ్య, కల్తీ.లక్ష్మి నారాయణ, కుంజ.రామయ్య, బి.రవి, చిన్న, శ్రీను, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు టిప్పర్ ఢీకొని నాలుగు గేదెలు మృతి

వైరా, : మండలంలోని తిప్పనపల్లి జాతీయ రహదారిపై అర్ధరాత్రి బొగ్గు టిప్పర్ ఢీకొనడంతో నాలుగు పాడి గేదెలు మృతి చెందాయి. తిప్పనపల్లి తండాకు చెందిన ఉప్పలయ్య పాడి గేదెలు మేతకెళ్లి ఇంటికి రాలేదు. అర్ధరాత్రి సమయంలో ఇంటికి వస్తుండగా జాతీయరహదారిపై నాలుగు గేదెలు మృతి చెంది కనిపించాయి. తనకు సుమారు రూ.4 లక్షల మేరకు నష్టం జరిగిందని ఉప్పలయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తనకు న్యాయం చేయాలంటూ ఉప్పలయ్య అధికారులు కోరుతున్నాడు.

## మేడారం జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసు : ఎమ్మెల్యే



ఇల్లందు, : ఖమ్మం జిల్లా ఇల్లందు ఆర్టీసీ బస్టాండ్ నుంచి మేడారం జాతరకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సును ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ప్రారంభించారు. బస్సులో టికెట్ తీసుకుని కరెంట్ ఆఫీస్ వరకు వెళ్లి.. మళ్లీ బస్టాండ్‌కు వచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇల్లందు నుంచి వయా గుండాల, పస్రా మీదుగా మేడారం వరకు బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సును ప్రయాణికులు సద్వినియోగం చేసుకుని సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు. ముఖ్యంగా మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి ఉచితంగా మేడారం జాతరను తిలకించి, ఆనందంగా గడిపేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ బస్సును ఏర్పాటు చేసిందన్నారు. ఎమ్మెల్యే వెంట కొత్తగూడెం డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, ఇల్లందు డిపో ఇన్‌ఛార్జి సునీత తదితరులు ఉన్నారు.

## నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఇందిరమ్మ ఇండ్లు

నర్సంపేట, : దశాబ్ద కాలంగా నిరీక్షించిన నిరుపేదల సొంతింటి కల ఇందిరమ్మ ప్రభుత్వంలో నెరవేరుతోందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నల్లబెల్లి మండలం రామతీర్థం గ్రామంలో సట్ల ఐలమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోగా, నల్లబెల్లి మండల కేంద్రంలో మొట్టమొదటి ఇంటి గృహప్రవేశానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి, లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది ప్రజాపాలనలో నిరుపేదల కల నెరవేర్చే తరుణమని ఆయన పేర్కొన్నారు.

## మడికొండ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం చివరి సోమవారం రుద్రాభిషేకం

వర్ధన్నపేట, : హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ గ్రామంలోని శ్రీ నెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం చివరి సోమవారం రోజున మహాశివునికి ప్రత్యేకమైన రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించారు. లోక కళ్యాణం కోసం పార్వతీ పరమేశ్వరుల శాంతి కళ్యాణ మహోత్సవం కూడా నిర్వహించబడుతుందని, రూ. 1516 చెల్లించి భక్తులు పాల్గొనవచ్చని కార్యనిర్వాహక అధికారి సునీత, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ తెలిపారు.

## నర్సంపేట అయ్యప్ప ఆలయంలో అన్నదాన భిక్షకు భక్తుల తాకిడి

పరకాల, : నర్సంపేట పట్టణంలోని మహా శబరిమలైగా ప్రసిద్ధి చెందిన అయ్యప్ప స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయంలో కొనసాగుతున్న అన్నదాన భిక్ష కార్యక్రమానికి భారీ సంఖ్యలో అయ్యప్ప భక్తులు తరలివచ్చి పాల్గొంటున్నారు. "స్వామియే శరణం అయ్యప్ప" నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగుతోంది. ఈరోజు అన్నదానం దాతలుగా సింగరి కొండ సురేష్, విజయదంపతులు వ్యవహరించారు.

## కాంగ్రెస్ వైఖరితోనే రైతుల ఆత్మహత్యలు

వరంగల్ ఈస్ట్, : రైతు సమస్యలను గాలికి వదిలేసి కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగిస్తోందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయంలో మాజీ చీఫ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, గండ్ర వెంకరమణారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు, ఆటో కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు ఆత్మహత్యలు చేసుకొంటున్నారన్నారు. సీసీఐ నిబంధనలు రైతులను ఇబ్బంది పెడుతోందని వెల్లడించారు.

సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు రావు మంగళవారం వరంగల్ ఎనుమాముల మార్కెట్‌ను సందర్శిస్తారని పేర్కొన్నారు. "కేంద్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదు. రాష్ట్రానికి కేంద్ర మంత్రులు చేసినది ఏదీ లేదు.

## ఎనుమాములలో నిలిచిన పత్తి కొనుగోళ్లు

వరంగల్ : భారత పత్తి సంస్థ (సీసీఐ) జిన్నింగ్ మిల్లుల కేటాయింపుల్లో నా1, నా2, నా3 నిబంధనలు సడలించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిపివేసింది. దీంతో ఎనుమాముల మార్కెట్ నిర్మానుష్యంగా మారింది. విషయం తెలియక పత్తి తీసుకొచ్చిన రైతులు పత్తి యార్డు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎనుమాముల మార్కెట్‌తో పాటు జిన్నింగ్ మిల్లుల్లో (సీసీఐ కొనుగోలు కేంద్రాలు) పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

## లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు.. ఇద్దరి మృతి

జనగామ, : అర్ధరాత్రి వేళ.. ప్రయాణికులు గాఢనిద్రలో ఉన్న సమయాన.. ఓ ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు చనిపోగా.. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ వరంగల్-1 డిపోనకు చెందిన రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సు హనుమకొండ నుంచి 16 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. రఘునాథపల్లి దాటి.. నిడిగొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగుతున్న క్రమంలో రహదారి పక్కన నిలిపి ఉన్న ఇసుక లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సు నుజ్జునుజ్జవడంతో ముందు సీట్లో కూర్చున్న హనుమకొండ జిల్లా బాలసముద్రానికి చెందిన నవజీత్ సింగ్(52), హైదరాబాద్ దోమలగూడ వాసి పులుంపరి ఓంప్రకాశ్ (65) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను జనగామ జనరల్ ఆసుపత్రికి తరలించారు.

## మేడారంలో భక్తుల సందడి

ములుగు, : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క సారలమ్మ దేవతలను దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, ఒడ్డున ఉన్న గద్దెల వద్ద ముడుపులు కట్టారు. అమ్మవారి గద్దెల వద్ద ఎత్తు బెల్లం, కొబ్బరికాయలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎండోమెంట్ అధికారులు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

## ప్రజల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే

మెదక్, : మెదక్ లో కొత్త శాశ్వత మెడికల్ కాలేజ్ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సోమవారం శంకుస్థాపన చేశారు. రోడ్లు, మౌలిక వసతులు, విద్యా, వైద్య రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు హర్షంతో స్వాగతిస్తున్నారు. ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని రోహిత్ తెలియజేశారు. ఈ మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తి అయితే మెదక్ ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని ఆయన అన్నారు.

## గజ్వేల్ ఆలయంలో కార్తీక దీపోత్సవం: 18,116 దీపాలతో అమ్మవారికి పూజలు



గజ్వేల్, : సిద్దిపేట జిల్లా గజ్వేల్ శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రతిరోజూ సహస్ర దీపారాధన జరుగుతోంది. మంగళవారం సాయంత్రం కార్తీక దీపోత్సవం, శ్రీ తులసి దాత్రి నారాయణ కళ్యాణం, వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, 18,116 దీపాలు వెలిగించే కార్యక్రమంలో అందరూ పాల్గొని అమ్మవారి కృప పొందాలని నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్ కోరారు. ఈ కార్యక్రమానికి ఆర్థికంగా సహకరించిన వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురోహితులు, కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు, పలువురు పాల్గొన్నారు.

## నెల్లూరులో ప్రధాన సమస్యలపై
# మంత్రి నారాయణ ఫోకస్

- హామీ ఇచ్చిన గంటల వ్యవధిలోని ప్రధాన సమస్యలకు పరిష్కార మార్గం
- సండే మార్కెట్ వద్ద రోడ్డు పనులకు శంకుస్థాపన
- ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం
- ఇచ్చిన ప్రతి హామీని సకాలంలో నెరవేరుస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



నెల్లూరు(ప్రశ్న న్యూస్) నెల్లూరులో ప్రధాన సమస్యలపై రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో హామీ ఇచ్చిన గంటల వ్యవధిలోనే సమస్యల పరిష్కారానికి మంత్రి కార్యచరణ చేపట్టారు. నెల్లూరు సండే



మార్కెట్లో వర్షాలు వచ్చిన సమయంలో నెలకొంటున్న తీవ్ర ఇబ్బందికి పరిష్కారమార్గం చూపారు. సండే మార్కెట్ వద్ద రోడ్డు పనులకు మంత్రి నారాయణ శంకుస్థాపన చేశారు. అలాగే ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద కోటి రెండులక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభింప చేశారు. శంకుస్థాపన కార్యక్రమాలకు విచ్చేసిన మంత్రి నారాయణ కు స్థానిక టిడిపి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ మంత్రి నారాయణ ముందుకు కదిలారు.ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి రోడ్డు వద్ద నెలకొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా పనులకు శంకుస్థాపన చేసామన్నారు. 44 రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్ 31వ తేదీన ఈ రోడ్డును ప్రారంభిస్తామని తెలియజేశారు. రద్దీ ప్రాంతం కావటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వన్ సైడ్ రోడ్ పనులు తొలివిడతగా చేపట్టామన్నారు. మరో కోటి రూపాయలతో డిసెంబర్ 31 న రెండో సైడ్ రోడ్ పనులకు శంకుస్థాపన చేస్తానన్నారు. ఫిబ్రవరి 15 న రోడ్డును ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా సండే మార్కెట్లో వర్షాల సమయంలో నెలకొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సండే మార్కెట్ ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే సోమవారం పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కాలువలపై ఆక్రమణదారులు సహకరిస్తే పూడిక తీయించి వర్షపు నీరు సజావుగా వెళ్లే విధంగా చేస్తామన్నారు. తద్వారా సండే మార్కెట్లో మరోసారి వర్షపు నీరు నిలిచే అవకాశం ఉండదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరులో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్ తో పాటు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, నగర అధ్యక్షుడు మామిడాల మధు ,45వ డివిజన్ అధ్యక్షుడు సుజనా కుమార్,క్లస్టర్ ఇంచార్జి శ్రీకాంత్ రెడ్డి,కో క్లస్టర్ రవి,క్లస్టర్ ఇంఛార్జి శ్రీకాంత్, టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముద్దుల్వాయి మాజీ గుండారం. రామచంద్ర గౌడ్ కు మాజీ డిప్యూటీ స్పీకర్ ఘన నివాళి.



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) హవెలిఘనపూర్ మండలం మద్దుల్వాయి మాజీ సర్పంచ్ గుండారం కిరణ్ గౌడ్ తండ్రి గుండారం. రామచంద్ర గౌడ్ ఆదివారం మరణించారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్,మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి సోమవారం ముత్తాయికోట గ్రామానికి చేరుకొని రామచంద్ర గౌడ్ పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం మాజీ సర్పంచ్ కిరణ్ గౌడ్ పరామర్శించి,వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని తెలిపారు.రామచంద్ర గౌడ్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలిపారు.వీరి వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కో కన్వీనర్ గడ్డమీద.కృష్ణ గౌడ్,మాజీ సర్పంచ్ కృష్ణ,మాజీ ఎంపీటీసీ శివ, నాయకులు ఫాజిల్, సోహెల్, స్వామి నాయక్ తదితరులు ఉన్నారు.

## మూగ జీవాలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ముందుకు పోతున్నానము

**మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) పాపన్నపేట్ మండలం చికోడు, నాగసానిపల్లి గ్రామంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన 02పశు వైద్యశాల భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలో పాపన్నపేట మండలం చికోడు గ్రామంలో ,20 లక్షల నాగ్సన్ పల్లి గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగానిర్మాణం పూర్తి చేసుకున్న 02 పశువైద్యశాల భవనాలు ఈరోజు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో పశు వైద్య భవనాలను నిర్మించడంతోపాటు అన్ని వసతులు కల్పించి పశు పక్షాదులకు డాక్టర్లు సిబ్బంది అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశు పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య,పంచాయతీరాజ్ డి.ఇ పాండురంగారావు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ లో ప్రభుత్వ వైద్య విద్యారంగానికి
# మరొక గొప్ప మైలురాయి

**శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ పట్టణంలోని పిల్లికొట్యాల శివారులో ప్రభుత్వ వైద్య కళాశాలకి శంకుస్థాపన భూమి సర్వే నెంబర్ 890లో, 20 ఎకరాల విస్తీర్ణభూమిలో, రాష్ట్ర ప్రభుత్వం రూ.180 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో, నూతన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే రోహిత్ రావు శంకుస్థాపన జరిపారు. వైద్యరంగ అభివృద్ధికి ఇది ఓ చిరస్మరణీయ ఘట్టమని, జిల్లా విద్యార్థులకు మెడికల్ సీట్లు అందుబాటులోకి రావడం, వైద్య సేవలు మరింత అందుబాటులోకి రావడం వల్ల స్థానిక ప్రజలకు, విద్యార్థులకు సహాయపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ: "ప్రభుత్వ ప్రాధినిధ్యంతో, సమగ్ర వైద్యసదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.నూతన వైద్య కళాశాలతో జిల్లా అభివృద్ధి మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రాథమిక వైద్యంతో పాటు అత్యంత ప్రధానమైన వైద్య విద్యను అందించేలా మెడికల్ కళాశాలను రూపొందిస్తున్నామన్నారూ . ప్రతిభావంతులకు మెడికల్ విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వ%శీ% ముందడుగు వేస్తుందన్నారు.నూతనంగా నిర్మించనున్న వైద్య కళాశాల భవనాలు, అనుబంధ హాస్పిటల్ ఆధునాతన వైద్య సదుపాయాలతో నిర్మాణాలు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా, సూపర్డెంట్ సునీత, డి సి హెచ్ ఎస్ శివ దయాల్, ఎంసీఏ హెచ్ ఓ డి రాజశ్రీ, వివిధ,ప్రొఫెసర్లు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొద్దుల రుక్మిణి కృష్ణ ఆరోగ్య శాఖా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై సిఐటియు పోరాటాలు: ఎల్లయ్య, స్వామి

నర్సాపూర్, : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, బండ్ల స్వామి తెలిపారు. గజ్వేల్ లోని సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో, సిద్దిపేట జిల్లా సిఐటియు నాలుగో మహాసభల్లో కార్మిక సమస్యలపై తీర్మానాలు చేసి, నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్మికులందరికీ నెలకు 26 వేల రూపాయల కనీస వేతనం, జిల్లాలో ఈఎస్ఐ లోకల్ కార్యాలయం, డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లు, మున్సిపల్, గ్రామపంచాయతీ, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటాలు కొనసాగుతాయని అన్నారు.

## కాలుష్యకారక పరిశ్రమలపై
# చర్యలు తీసుకోవాలని ధర్నా

సంగారెడ్డి, : కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ కాలుష్య నియంత్రణ మండలి అధికారులపై కాలుష్య జలాలను చల్లడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు నిరసనకారులను అడ్డుకున్నారు. అనంతరం గ్రామస్థులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

## అనుమానాస్పద స్థితిలో
# వివాహిత మృతి

దబ్బాక, : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేటలో శనివారం చోటుచేసుకోగా.. వెలుగులోకి వచ్చింది. ఏఎస్సై వెంకటేశం తెలిపిన వివరాలు.. వట్‌పల్లి మండలం బిజిలీపూర్‌కు చెందిన పట్నం లక్ష్మి(26)ని పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేటకు చెందిన పట్నం ప్రవీణ్‌కిచ్చి 22 నెలల క్రితం వివాహం చేశారు. నాలుగు నెలలు వీరి కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత అత్తింటి వారు అదనపు కట్నం కోసం వేధించడం ఆరంభించారు. ఈ వేధింపులు భరించలేక లక్ష్మి మూడు నెలల పాటు పుట్టింటిలోనే ఉన్నారు. ఆ తర్వాత పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి అత్తారింటికి పంపించారు. శనివారం అపస్మారకస్థితిలో ఉన్న లక్ష్మిని అత్తింటివారు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.






## ఈ ప్రాజెక్ట్ కోసం ఈగర్‌గా వెయిట్ చేస్తున్నా..

హీరో శింబు, రామ్ కుమార్ బాలకృష్ణన్ కాంబినేషన్‌లో ఓ భారీ ప్రాజెక్ట్ రాబోతున్న విషయం తెలిసిందే. శింబు కెరీర్‌లో 49 వ చిత్రంగా రాబోతున్న ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాగా..వి క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించనున్నట్లు తెలుస్తుంది. తమిళ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. యంగ్ బ్యూటీ కయ్యదు లోహార్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఇదిలా ఉంటే.. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసిన తర్వాత ఇందులో నుంచి మరో అప్డేట్ రాలేదు. దీంతో శింబు ఫ్యాన్స్ ఈ సినిమా నుంచి వచ్చే అప్డేట్స్ కోసం ఈగర్‌గా వెయిట్ చేస్తుండగా.. తాజాగా ఇంటర్వ్యూలో పాల్గొన్న కయ్యదు లోహార్ ఎస్‌టిఆర్ -49 పై అప్డే ఇచ్చింది. 'ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదు.. కానీ చిత్ర బృందం దాని కోసం సిద్ధమవుతోంది.

చిత్రీకరణ వచ్చే ఏడాది ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దర్శకుడు అండ్ నిర్మాణ సంస్థ ప్రతిదీ జాగ్రత్తగా రూపొందిస్తున్నారు. అంతే కాదు.. ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం నాకు చాలా థ్రిల్‌గా అనిపిస్తుంది. అంతే కాదు.. ఈ ప్రాజెక్ట్‌లో చేరడానికి చాలా ఈగర్‌గా వెయిట్ చేస్తున్నా' అని తెలిపింది.

# ఇక ఊరుకునేది లేదు..




స్టార్ కిడ్ మంచు లక్ష్మి చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ ఇండస్ట్రీకి చెందిన వారందరితో పరిచయాలున్నాయి. ప్రగ్యా జైస్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్ వంటి హీరోయిన్లతో పాటు మరికొందరు ఈమెకు క్లోజ్ ఫ్రెండ్స్ అన్న విషయం తెలిసిందే. నిత్యం వెకేషన్లకు వెళ్తూ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. అవి కాస్త సోషల్ మీడియాలో అతి తక్కువ సమయంలోనే వైరల్ అవుతుంటాయి. కానీ గత కొద్ది కాలంగా ఈ ముగ్గురు ఎవరి లైఫ్‌లో వాళ్లు ఫుల్ బిజీగా ఉండటం వల్ల ట్రిప్పులకు వెళ్లడం లేదు. ఇటీవల ఒకేచోట కనిపించిన దాఖలాలు కూడా లేవు. దీంతో వీరి మధ్య గొడవలు వచ్చినట్లు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో భాగంగా మంచు లక్ష్మి రకుల్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వాల్సిన సమయం వచ్చిందని చెప్పింది. "మా ఇద్దరి జీవితాల్లోనూ చాలా మార్పు వచ్చింది. నేను ముంబైకి మకాం మార్చాను. రకుల్ పెళ్లి చేసుకుని ఎంజాయ్ చేస్తోంది. మా ఇద్దరి జీవితాల్లో మార్పు సహజం. నాకంటే రకుల్ పూర్తిగా మారిపోయింది. చిన్న ప్లాన్‌ను అయినా తన భర్తకు చెప్తుంది. నేను జాకీని అడిగి చెప్తా అంటుంది. ఎప్పుడూ ఏం అడిగినా పదే పదే ఆమె భర్తకు చెప్పాలని చెప్తుంది. ఇది కొత్తగా పెళ్ళైన వారిలో కనిపించే విషయం కాబట్టి మరో ఏడాది పాటు ఓపికపడతాను. ఆ తర్వాత ఖచ్చితంగా స్ట్రాంగ్‌గానే దండిస్తా. వార్నింగ్ కూడా ఇస్తాను" అని సరదాగా చెప్పింది.

## పెళ్లి చేసుకోబోతున్న సాయి ధరమ్ తేజ్..



టాలీవుడ్ హీరోలు ఒక్కొక్కరిగా బ్యాచ్‌లర్ లైఫ్‌కు గుడ్ బై చెప్పేస్తున్నారు. ఇన్నాళ్లు చేసినట్లుగా కాకుండా అధికారికంగా ప్రకటించకుండానే సీక్రెట్‌గా పెళ్లి తంతును సైతం పూర్తి చేసుకుంటున్నారు.కొందరు మాత్రం పెళ్లి ప్రకటనతో సర్‌ప్రైజ్ ఇస్తున్నారు. ఇటీవల అల్లు శిరీష్ తన ఎంగేజ్‌మెంట్ చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచాడు. నైనికా అనే అమ్మాయిని ప్రేమించిన ఆయన త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారన్న విషయం తెలిసి ఇదెప్పుడు జరిగిందని అంతా షాక్ అవుతున్నారు. ఇక ఇటీవల నారా రోహిత్ కూడా తనతో పని చేసిన సిరి లేల్లను ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో యంగ్ హీరో పెళ్లి చేసుకోబోతున్నట్లు వెల్లడించి బిగ్ షాకిచ్చాడు. అసలు విషయంలోకి వెళితే.. నేడు మెగా హీరో సాయి ధరమ్ తేజ్ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "నేను వచ్చే ఏడాది పెళ్లి చేసుకోబోతున్నాను. నాకు మంచి సినిమాలు, మంచి జీవితం ఇచ్చిన శ్రీవారికి కృతజ్ఞతలు తెలిపేందుకే తిరుమలకు వచ్చాను. కొత్త సంవత్సరం శ్రీవారి ఆశీస్సులతో ముందుకు సాగాలని కోరుకున్నాను. అందుకే ఇక్కడికి వచ్చాను. త్వరలో 'సంబరాల ఏటిగట్టు' సినిమాతో రాబోతున్నాను. నాకు ఈ ప్రాజెక్ట్ హిట్ ఇస్తుందని నమ్మకం ఉంది" అని అన్నారు.ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు షాక్ అవుతున్నారు. కాగా.. పాన్ ఇండియా సినిమాగా రాబోతున్న 'సంబరాల ఏటిగట్టు' రోహిత్ కేపీ తెరకెక్కిస్తున్నారు.ఇది తేజ్ కెరీర్‌లో కీలక మలుపుగా మారనుంది. దీనిని ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. ఇందులో సాయి ధరమ్ తేజ్ సరసన ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తోంది. షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదల తేదీ ప్రకటించినప్పటికీ షూటింగ్ పూర్తి కానందున రిలీజ్ వాయిదా పడింది.

# 'అఖండ-2' మాస్ పోస్టర్ విడుదల



గాడ్ ఆఫ్ ది మాసెస్ బాలయ్య అభిమానులంతా ఈగర్‌గా వెయిట్ చేస్తున్న లేటెస్ట్ మూవీ 'అఖండ-2'. బోయపాటి శ్రీను పవర్ ఫుల్ కొలాబరేషన్‌తో డివైన్ యాక్షన్ ఎక్స్‌ట్రావగాంజాగా రాబోతుంది. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి సగర్వంగా చిత్రాన్ని సమర్పిస్తున్నారు.హర్షల్ మల్హోత్రా ఈ సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం కాబోతుంది. అఖండకు సీక్వెల్‌గా రాబోతున్న 'అఖండ-2తాండవం'లో బాలయ్య సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన టీజర్స్, ఫస్ట్ సింగిల్ తాండవం అద్భుతమైన రెస్పాన్స్ తో భారీ అంచనాలు సృష్టించాయి. ఈ చిత్రం డిసెంబర్ 25, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అప్పుడే ప్రమోషన్స్ మొదలెట్టేసిన మూవీ మేకర్స్ వరుస అప్డేట్స్ ఇస్తూ అభిమానుల్లో హైప్ పెంచుతున్నారు. ఇటీవల ఈ సినిమా 3%ణ%లో రాబోతున్నట్లు డైరెక్టర్ అధికారికంగా ప్రకటించి అందరినీ సర్‌ప్రైజ్ చేశారు. ఇక ఇప్పుడు 'అఖండ-2' నుంచి మరో అప్డేట్ రాబోతున్నట్లు వెల్లడించారు. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన సెకండ్ సింగిల్ వస్తున్నట్లు ఓ పోస్టర్‌ను షేర్ చేసి అభిమానుల్లో జోష్ పెంచారు. "జాజికాయ.. జాజికాయ" అని సాగే ఈ పాటను వైజాగ్‌లోని జగదాంబ థియేటర్‌లో ఓ ఈవెంట్‌లో లాంచ్ చేయనున్నారు. ఈ లిరికల్ వీడియో నవంబర్ 18న రాబోతున్నట్లు తెలుపుతూ.. బాలయ్య బ్లాక్ అవుట్‌ఫిట్‌లో మీసాలపై వేలు పెట్టుకుని స్టైలిష్‌గా నిలబడి ఉండగా.. సంయుక్తా మీనన్ గోల్డ్ కలర్ డ్రెస్‌తో మెరిసిపోతుంది. ఈ మాస్ పోస్టర్ చూసిన నెటిజన్లు ఇక సంయుక్తకు దబిడి దిబిడే అని కామెంట్లు పెడుతున్నారు.

## 'మా రాముడు అందరివాడు' టీజర్ రిలీజ్..



అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు నిర్మాతలుగా యద్దనపూడి మైకిల్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'మా రాముడు అందరివాడు'. ఇందులో శ్రీరామ్, స్వాతి జంటగా నటిస్తుండగా..హీరో సుమన్, సమ్మెట గాంధీ, నాగ మహేష్, బాహుబలి ప్రభాకర్, జబర్దస్ అప్పారావు, గడ్డం నవీన్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం భాషలో పాన్ ఇండియా స్థాయిలో యాక్షన్, డ్రామా, సస్పెన్, ఎమోషన్స్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రానుంది. త్వరలో రిలీజ్‌కు సిద్ధం అవుతున్న ఈ చిత్రానికి సంబంధించి లేటెస్ట్‌గా టీజర్, ఆడియో లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా వచ్చిన నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్ మాట్లాడుతూ.. 'మంచి టైటిల్‌తో ప్రేక్షకుల ముందు రావడం గొప్ప విషయం. చిత్ర పరిశ్రమలో ఎంతో పెద్ద హీరోలు పెట్టుకునే స్థాయిలో ఈ చిత్ర టైటిల్ చాలా బావుంది. ఇందులో గద్దర్ నరసన్న పాట పాడటం ప్రత్యేకం. సినిమా బావుంటే దూసుకెళ్లిపోయే రోజులు. కాబట్టి ఈ సినిమా మంచి విజయాన్ని సాధించాలని.. ప్రేక్షక ఆదరణ పొందాలని కోరుకుంటున్నాను. సినిమా బృందం అందరికీ మంచి భవిష్యత్తు ఉండాలని ప్రార్థిస్తున్నాను' అన్నారు.

# నన్ను చాలామంది మోసం చేశారు



టాలీవుడ్ హీరో శర్వానంద్ పెళ్లి తర్వాత పర్సనల్ లైఫ్‌లో ఫుల్ బిజీ అయిపోయాడు. సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసినప్పటికీ ఆయనకు పెద్దగా కలిసి రావడం లేదు. వరుసగా ఫ్లాపులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ హిట్, ఫ్లాప్ అని ఆలోచించకుండా బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం శర్వానంద్ నటిస్తోన్న మూవీ 'బైకర్'తో రాబోతున్నారు. ఇందులో సీనియర్ హీరో రాజశేఖర్ కీలక పాత్రలో నటిస్తుండగా.. మాళవికా నాయర్ హీరోయిన్‌గా కనిపించనుంది. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే ఇందులోంచి విడుదలైన పోస్టర్స్, ఫస్ట్ సింగిల్ ప్రెట్టీ బేబీ మంచి ఆదరణను దక్కించుకున్నాయి. దీంతో 'బైకర్' ప్రమోషన్స్ స్టార్ట్ చేసి ఫుల్ బిజీ అయిపోయారు. తాజాగాచ ఓ కార్యక్రమంలో పాల్గొన్న శర్వానంద్ జీవితంపై కీలక వ్యాఖ్యలు చేశారు. "ఈరోజు మీ దగ్గరికి ఓ గెస్ట్‌లా రాలేదు.. ఒక అన్నలా వచ్చాను, నా జీవితంలో జరిగిన కొన్ని విషయాలు మీతో పంచుకుంటాను. జీవితంలో చాలాసార్లు పడ్డాను, ఎన్నోసార్లు ఓడిపోయాను, మోసపోయాను. కానీ పడిన తర్వాత ప్రతిసారి నేర్చుకున్నాను. ఏదో ఒకటి జీవితం నేర్పించింది. మన కథ మనమే రాసుకోవాలి. బుక్ నీది..పెన్ను నీది, స్టోరీ నీది..మీ ఇష్టం వచ్చినట్లు రాసుకోండి"అని చెప్పారు. ఇక ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఈ విషయం తెలుసుకున్న వారంతా అంతగా జీవితంలో శర్వానంద్‌కు ఏం జరిగిందని పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

# నిత్యామీనన్ షాకింగ్ కామెంట్స్



నిత్యా మీనన్ 'అలా మొదలైంది' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి ప్రేక్షకుల మనసులు గెలుచుకుంది. అందం, అభినయంతో అతి తక్కువ సమయంలోనే వరుస ఆఫర్లు దక్కించుకుని ఇండస్ట్రీలో మంచి క్రేజ్ రాబట్టుకుంది. హీరోయిన్, సింగర్‌గా గుర్తింపు తెచ్చుకుని పలు చిత్రాలతో హిట్స్‌ను తన ఖాతాలో వేసుకుంది. చాలా రోజుల తర్వాత మళ్లీ ఇటీవల 'ఇడ్లీ కడై' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నిత్యా మీనన్ బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన జీవితంలో జరిగిన ఓ చేదు అనుభవాన్ని గుర్తు చేసుకుంది. "నాకు ఇండస్ట్రీలో ఓ పెద్ద దెబ్బ తగిలింది. ప్రభాస్ విషయంలో ఓ ఇష్యూ నన్ను ఇప్పటికీ బాధపెడుతోంది. నా గురించి జర్నలిస్టులు అలా రాయడం చూసి చాలా హర్ట్ అయ్యాను. 'అలా మొదలైంది' సినిమా వచ్చిన సమయంలో నేను చాలా చిన్నదాన్ని. అప్పుడే నేను కొత్తగా ఇండస్ట్రీకి వచ్చాను. ఫస్ట్ మూవీ అప్పుడు తెలుగు కూడా సరిగ్గా రాదు. తెలుగు సినిమాలు కూడా చూసింది లేదు. అదే సమయంలో ఓ ఇంటర్వ్యూలో నన్ను ప్రభాస్ గురించి అడిగితే నాకు తెలియదని చెప్పాను. ఆ విషయాన్ని పెద్దది చేశారు. నా అమాయకత్వాన్ని ఉపయోగించుకున్నారు. నేను ఏదో పెద్ద తప్పు చేసినట్టుగా న్యూస్ క్రియేట్ చేశారు. ఆ ఇష్యూతో హానెస్ట్‌గా అన్ని చోట్లు ఉండకూడదని అర్థమైంది. ఎక్కడా ఎలా ఉండాలో అలాగే ఉండాలని.. మాటల గారడీ చేస్తేనే నచ్చుతుందని తెలుసుకున్నా. అక్కడ ఉన్న మీడియా వాళ్లకు కూడా తెలుసు నాకు తెలుగు రాదని.. ప్రభాస్ ఎవరో తెలియదని.. అందుకే నన్ను కావాలని అడిగారు. నాకు తెలియదు కాబట్టి తెలియదని చెప్పేశా.. ఆ విషయాన్ని పెద్దది చేసి ఏదేదో అనేశారు.

# మ్యూజికల్ లవ్ స్టోరీ రీ రిలీజ్..



సినీ ఇండస్ట్రీలో ప్రస్తుతం రీరిలీజ్ ట్రెండ్ నడుస్తున్న సంగతి తెలిసిందే. బర్త్ డేలు, స్పెషల్ ఈవెంట్స్ సందర్భంగా ఇప్పటికే స్టార్ హీరోలతో పాటు.. చిన్న హీరోల సినిమాలు కూడా థియేటర్స్‌లో రీరిలీజ్ అయ్యి మంచి టాక్ సొంతం చేసుకుంటున్నాయి. అలాగే కొన్ని సినిమాలు రిలీజ్ సమయంలో హిట్ అందుకోనప్పటికీ.. రీరిలీజ్‌లో ఎక్కువ వసూళ్లు రాబట్టి సూపర్ సక్సెస్ అవుతున్నాయి. ఇక సినీ లవర్స్ కూడా తమ అభిమాన హీరో సినిమా రీరిలీజ్ అంటే ముందే ఉంటున్నారు. ఇందులో భాగంగానే ఇప్పుడు మ్యూజికల్ లవ్ స్టోరీ రీరిలీజ్‌కు సిద్ధం అయింది. 2010లో వచ్చి మ్యూజికల్ హిట్‌గా నిలిచిన 'ఆవారా' చిత్రం రీరిలీజ్ అయ్యేందుకు సిద్ధం అవుతోంది. కార్తీ, తమన్నా జంటగా నటించిన ఈ మూవీకి ఎన్. లింగుస్వామి దర్శకత్వం వహించారు. 2010లో వచ్చిన ఈ మూవీ మ్యూజికల్ బ్లాక్ బస్టర్ అయ్యింది. ఈ సినిమాలో సాంగ్స్ అప్పుడు, ఇప్పుడు అనే తేడా లేకుండా మ్యూజిక్ లవర్స్‌తో పాటు యూత్‌ను సైతం కట్టిపడేశాయి. అలాంటి ఈ చిత్రం ఇప్పుడు మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అయింది. ఈ మేరకు 'ది ఎవర్ రిఫ్రెషింగ్ లవ్ స్టోరీ ఆవారా నవంబర్ 22న తిరిగి విడుదలవుతోంది.. మ్యూజికల్ హిట్‌ను మరోసారి ఎంజాయ్ చేయండి' అంటూ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న
# రేషన్ బియ్యం పట్టివేత





జిన్నారం (ప్రశ్న న్యూస్) బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అక్రమంగా ప్రభుత్వ రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు సి. ఐ రవీందర్ రెడ్డి తెలిపారు. బొల్లారం జ్యోతి నగర్ నుండి 80 బస్తాలు సుమారు 37 కింటలు రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటో సీజ్ డ్రైవర్ రాజు ఓనర్ జైపాల్ అక్రమంగా అమ్ముతున్న రేషన్ డీలర్ అలివేలమ్మల పై డిప్యూటీ తహసిల్దార్ సివిల్ సప్లై అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

# విద్యుత్ షాక్ తో 3 బర్రె మృతి



పటాన్ చెరు (ప్రశ్న న్యూస్)సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం చిన్న కంజర్ల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం సమయంలో బర్రె విద్యుత్ షాక్ తో మృతి చెందినట్లు యజమాని తెలిపారు. తన వ్యవసాయం ఆధారిత బర్రెలను మేపడానికి తీసుకెళ్తుండగా అక్కడ సమీపంలో ఎల్ టి లైన్ కరెంటు తీగలు తెగిపడిపోవడం వల్ల బర్రెలు వాటికి తగిలి అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది మూడు బర్రెలు ఒక్కొక్క బర్రె సుమారు లక్షల 50 వేల రూపాయలు కలిగి ఉంటుంది.రోజుకు 9,10 లీటర్ల పాలు ఇస్తూ తనకు జీవనాధారమైన బర్రె చనిపోవడం బాధాకరం. ప్రభుత్వ కరెంటు అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ లైన్లు తెగిపడిపోయి. అధికారులు పట్టించుకోని పరిస్థితి లేదు అంటూ తెలిపారు. అదేవిధంగా తనకు నష్టం వాటిల్లిందని విద్యుత్ శాఖ తనకు న్యాయం చేయాలని తెలిపారు. అలాగే నష్టపరాన్ని ఇచ్చి.. ఆదుకోవాలని రైతు తన గోద వ్యక్తం చేశారు.

## సినీ దర్శకుడు రాజమౌళిపై
# రాష్ట్రీయ వానర సేన పిర్యాధు

**(వారణాసి చిత్రం ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో హనుమంతుని పై రాజమౌళి అవమానకర వాఖ్యలు)**




సరూర్ నగర్ (ప్రశ్న న్యూస్) సనాతన ధర్మ రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతు అన్యాక్రాంతమవుచున్న ఆలయాల భూములను పరిరక్షించడమే లక్ష్యంగా రాష్ట్రీయ వానర సేన అడుగులు వేస్తుందని రాష్ట్రీయ వానర సేన సభ్యులు స్పష్టం చేసారు సమాజంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి, సనాతన ధర్మం పట్ల విషం కక్కుతు, హిందు దేవతల పట్ల అవమానకరమైన దోరణి ప్రదర్శించడం పట్ల తీవ్ర నిరసనను వ్యక్తం చేసారు. గత శనివారం నాడు వారణాసి చిత్రం ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో హిందువుల ఆరాధ్యదైవం అయిన హనుమంతునిపై ఎస్.ఎస్. రాజమౌళి ఉద్యేశపూర్వకంగా చేసిన అవమానకర వ్యాఖ్యలను రాష్ట్రీయ వానర సేన సభ్యులు తీవ్రంగా ఆక్షేపించి సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్ ను కలిసి సినీ దర్శకుడు రాజమౌళిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ వానర సేన సభ్యులు మాట్లాడుతు హిందువుల మనోభావాలను కించపరిచే విధంగా హిందు దేవతల పట్ల అవమానకర దోరణి అవలంభించడం సినీ రంగంలో రోజు రోజుకు ఉదృతమవుతుందని, ఆదిలోనే ఈ దోరణిని అణచివేయక పోతే ముందు ముందు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఇక ముందు ఎవరైనను హిందు దేవి దేవతల పట్ల చులకనభావం చూపేందుకు భయపడే విధంగా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వానర సేన సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. సమాజంలో మతం విద్వేషాలను రెచ్చగొట్టి హిందు మతంపై చులకనభావం ప్రదర్శించే వారిపట్ల హిందు సంఘాల నుండి ఇప్పటికే తీవ్ర ప్రతిస్పందనలు వ్యక్తమవుతున్న నేపద్యంలో ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని రాజమౌళి వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్
## అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా షేక్ నజీర్ పాషా..

**శాలువాలతో సన్మానించిన అసోసియేషన్ పెద్దలు..**



తల్లాడ (ప్రశ్నన్యూస్): ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన షేక్ నజీర్ పాషా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఖమ్మంలో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో ఆయనకు ఉపాధ్యక్షులుగా నియమించారు. గత సుదీర్ఘ కాలం పాటు గ్రానైట్ లో నిర్వహిస్తున్న నజీర్ పాషాను ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాషాను అధ్యక్షులు నునావత్ కిషన్, గౌరవాధ్యక్షులు అదాలత్ నరేందర్, గౌరవ సలహాదారు ఉపేందర్, జాయింట్ సెక్రెటరీ షేక్. జానీ శాలువాలతో సన్మానించారు. అనంతరం నజీర్ పాషా మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించినందుకు అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. సంఘం బలోపేతానికి తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని వెల్లడించారు. ఇంతటి అవకాశం కల్పించిన గ్రానైట్ ప్రతినిధులకు ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## హుస్సేన్ ను పరామర్శించిన
## జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




తల్లాడ (ప్రశ్నన్యూస్) తెలంగాణ జాగృతి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్. హుస్సేన్ ను తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. సోమవారం ఖమ్మంజిల్లా తల్లాడ మండలంలోని కుర్నవల్లి గ్రామంలో స్వగృహంలో ఆయనను పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో హుస్సేన్ కాలుకు గాయమైన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న ఆమె ఆయనను పరామర్శించి ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఆమె పేరుపేరునా పలకరించారు. అక్కడకు వచ్చిన మహిళలతో కొద్దిసేపు ముచ్చటించి ఏం చేస్తారని అడిగి తెలుసుకున్నారు. హుస్సేన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తెలంగాణ ఉద్యమ నాయకులు తొండపు రవికుమార్, వినయ్ కుమార్, సురేష్ బాబు, రవి, జంపాలా కృష్ణ, సైదులు, రఫీ, జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన యూనియన్ రాష్ట్ర నాలుగో
## మహాసభల్లో పాల్గొన్న సిరిసిల్ల జిల్లా కార్మికులు

- కార్మికుల సమస్యలకు సీఐటీయు నిరంతర పోరాటం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి : గురిజాల శ్రీధర్



బోయినిపల్లి / కోనరావుపేట (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, కోనరావుపేట మండలం నుంచి మధ్యాహ్న భోజన యూనియన్ కార్మికులు సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన యూనియన్ నాలుగో మహాసభలకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.ఈ కార్యక్రమానికి మధ్యాహ్న భోజన యూనియన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గురిజాల శ్రీధర్,కార్మికులైన గొట్టే బాలమణి,రెడ్డిమల్ల లక్ష్మి, గడ్డం పద్మ,లోకుర్తి శంకరవ్వ, తంగలపల్లి లక్ష్మి,లింగు రాధా తదితరులు హాజరయ్యారు.?

మహాసభలో గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ "మధ్యాహ్న భోజన పథకాన్ని భుజాల మీద మోస్తున్న కార్మికులకే సరైన గౌరవం, వేతన భద్రత లేకపోవడం విచారం. కనీస వేతనాలు,ఉద్యోగ భద్రత, ఆరోగ్య సదుపాయాలపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలి" అని పేర్కొన్నారు.అలాగే కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ పటిష్టంగా పోరాటాలు చేపడుతుందని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని ఆయన స్పష్టం చేశారు

## ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన స్థలం ఎంపిక, అంచనాల సిద్ధత కోసం సోమవారం సంబంధిత శాఖ అధికారులు పరిశీలన చేపట్టారు. చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు ఈ పరిశీలన నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నేతలు కూస రవీందర్,అక్కెనపల్లి ఉపేందర్, కన్నం మధు,పంచాయతీ రాజ్ డీఈ విష్ణువర్ధన్,తహశీల్దార్ నారాయణరెడ్డి,ఏఈ సాయి తేజరెడ్డి,రెవెన్యూ ఇన్స్పెక్టర్ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గందరగోళంలో కైలాసగిరి కాలనీ ఎన్నికలు

**కైలాసగిరి కాలనీ ఎన్నికలు ఆపాలంటూ కలెక్టర్ కు ఫిర్యాదు**

**మహిళలకు ప్రాతినిధ్యం ఇవ్వని కాలునీ ఎన్నికలు**

**కాలనీ ఎన్నికలకు మహిళలను దూరం చేస్తున్న కొందరు వ్యక్తులు**

**కాలనీ అభివృద్ధిలో మేము మీతో పోటీ పడతామంటున్న మహిళలు**



మేడ్చల్(ప్రశ్న న్యూస్) హైదరాబాద్ పరిధిలోని మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ కాలనీ నాలుగోవ డివిజన్లో కాలనీ ఎన్నికలలో గత 16 సంవత్సరాల నుండి కైలాసగిరి వెల్ఫేర్ అసోసియేషన్ లో మహిళలకు ప్రాతినిధ్యం ఇవ్వని కొందరు కాలనీవాసులు. కైలాసగిరి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్ నెంబర్ 91/2009 లో మేడ్చల్ జిల్లా రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్టర్ అవ్వగా కాలనీ ఎన్నికలలో మహిళలకు ఆ నటి నుండి ప్రధాన పదవులను కట్టబెట్టేది లేదంటున్న కొందరు కాలనీవాసులు కావాలంటే నంబర్లుగా తీసుకుంటాం కానీ వారికి పదవులు మాత్రం ఇచ్చేది లేదు కొత్త సాంప్రదాయాలు తీసుకురావద్దని అంటున్నారు. ప్రభుత్వం మహిళల పేరుపైన పట్టా భూములను అందివ్వగా వారికి మాత్రం కొందరు కాలనీవాసులు పదవులు ఇవ్వడానికి ససేమిరా అంటున్నారు. గతంలో కొందరు మహిళలు ముందుకు వచ్చిన కనీసం వారి నామినేషన్ తీసుకున్న దాఖలాలు లేవు. బస్తీలలో మహిళలకు బాగుండదు అనే నెపంతో అణిచివేస్తున్నారు. అదే బస్తీలలో మరి వెల్ఫేర్ అసోసియేషన్లు ఎందుకు? వారు చేస్తే సేవ.? అంతరిక్షంలోకే దూసుకెళ్తున్న మహిళలు ఉన్న నేటి తరంలో మహిళలను కైలాసగిరి వెల్ఫేర్ అసోసియేషన్ పదవిని ఇవ్వడానికే ముందుకు రాని కైలాసగిరిలోని కొందరు కాలిని వాసులు. ఈ కాలనీ ఎలక్షన్లలో మహిళలకి ప్రాతినిధ్యం ఇవ్వనిచో మరో కాలనీ సంక్షేమ సంఘం ఏర్పాటు తథ్యం అంటున్న మహిళలు.ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం దొంగల రాజ్యం దోపిడి రాజ్యం అంటున్న మహిళలు. ఇప్పటికైనా కాలనీవాసులు మహిళలకు ప్రాతినిత్యం కలిపిస్తూ కాలిని సంక్షేమంలో మహిళల పాత్ర కూడా కలుపుకొని సజావుగా కాలనీ ఎలక్షన్స్ జరిపించాలని మహిళలు పెద్ద ఎత్తున కోరుకుంటున్నారు.

# ఎలక్షన్ కమిషన్- బీజేపీ కుమ్మక్కు ఆరోపణలు

- న్యాత నవీన్ తీవ్ర వ్యాఖ్యలు
- ఓటు చోరీ నిరసనలో పాల్గొన్న వేములవాడ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్



వేములవాడ (ప్రశ్న న్యూస్) ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదురవుతున్న "ఓటు చోరీ", ఓటరు జాబితాలలో అవకతవకలు, ప్రజాస్వామ్య నిష్పక్షపాతంపై ఉత్పన్నమైన సందేహాలను ప్రతిష్ఠాత్మకంగా ప్రస్తావిస్తూ తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ సోమవారం గాంధీ భవన్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించింది.తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేషనల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్,అలాగే తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్చార్జ్లు హాజరయ్యారు. నిరసనలో న్యాత నవీన్ హాజరై మాట్లాడుతూ "దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా, బీజేపీ ప్రధాన నేత నరేంద్ర మోదీ ఎలక్షన్ కమిషన్‌తో కుమ్మక్కై దొంగ ఓట్ల సృష్టి చేసి గెలవాలని యత్నించడం ప్రజాస్వామ్యానికి ఎంతో హానికరం. ఎలక్షన్ కమిషన్ బీజేపీతో కలిసి ఇలాంటి చర్యలకు పాల్పడితే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున నిరసనలు చేపడతాం. రాష్ట్రంలో ఉన్న దొంగ ఓట్లను బయటపెట్టి ప్రజలకు నిజాలు చెబుతాం" అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. నిరసనను అడ్డుకునేందుకు పోలీసులు జోక్యం చేసుకోగా, పలువురు యువజన కాంగ్రెస్ నాయకులను,న్యాత నవీన్‌తో సహా, అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## 42 శాతం రిజర్వేషన్లు అమలు తర్వాతే
# స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

**- బీసీ సాధికారిత సంఘం నేతలు**

**: కొండ దేవయ్య, పొలాస నరేందర్**

వేములవాడ (ప్రశ్న న్యూస్) డిసెంబరులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ చేసిన నిర్ణయాన్ని బీసీ సాధికారిత సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా, షెడ్యూల్-9లో చేర్చి అమలు చేసిన తర్వాతే ఎన్నికలు జరగాలని గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య,ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక విజయాన్ని ఆసరాగా తీసుకుని పాత రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహిస్తే ప్రభుత్వం "బొక్కబోర్ల పడుతుందని" వారు హెచ్చరించారు. ఈ నెల 24న హైకోర్టు విచారణ ఉండగా కేసు వాయిదాకు, కేంద్రంపై ఒత్తిడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు.రిజర్వేషన్లకు విఘాతం కలిగితే బీసీల తిరుగుబాటు తప్పదని స్పష్టం చేసిన వారు, బీసీ హక్కుల కోసం పోరు కొనసాగుతుందని తెలిపారు. రిజర్వేషన్ల బిల్లుపై ఇండియా కూటమి పార్లమెంటులో ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు.



# అక్రమ నిర్మాణాలకు కాంగ్రెస్ నాయకుల పూర్తి మద్దతు.?

- గ్రేటర్ హైదరాబాదులో కాసులకు కక్కుర్తి పడుతున్న కాంగ్రెస్ నాయకులు
- అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతూ అందిన కాడికి స్వాహా
- అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకుంటే బెదిరిస్తున్న కాంగ్రెస్ నాయకులు
- అవినీతి అక్రమాలకు సహకరిస్తూ అడ్డొచ్చిన వారిపై మేమేంటో చూపిస్తాం
- అధికారం మాది.. అధికారులు మా మాట వినాల్సిందే
- అవినీతి అక్రమాలను అధికారులు అడ్డుకుంటే సహించేది లేదు, మేము చెప్పిందే వేదం
- అక్రమ నిర్మాణమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబితే సక్రమమే
- గ్రేటర్ హైదరాబాద్ లో కాంగ్రెస్ నాయకుల అక్రమ నిర్మాణాల దందా
- గ్రేటర్ హైదరాబాద్లో కాంగ్రెస్ పరువును మంటగలుగుతున్న నేతలు
- ఉన్నత పదులు అనుభవిస్తూ.. అక్రమాలకు సహకరిస్తూ.. అధికారులను బెదిరిస్తూ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాదులో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్న వాటిపై చర్యలు తీసుకోవడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు విఫలం చెందుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడపడితే అక్కడ అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అక్రమ నిర్మాణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వెనకాడుతున్నారు. ప్రతినెల జీతాలు మాత్రం సమయానికి తీసుకొని ఏసీ రూముల్లో కాలయాపన చేస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులు సమయాన్ని వృధా చేస్తున్నారని అక్రమ నిర్మాణాలపై స్థానికులు ఫిర్యాదు చేసిన చూసి చూడనట్టుగా ఉంటున్నారని ఇదేమిటని టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రశ్నిస్తే అక్రమ నిర్మాణాలపై మేము చర్యలు తీసుకుంటే రాజకీయ విలువలు లేని కొంతమంది నేతలు మాపై కక్ష కడుతున్నారని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది మేము ఏమి చెప్తే అది చేయాలని గ్రేటర్ హైదరాబాదులో కాంగ్రెస్ పార్టీ నాయకులు టౌన్ ప్లానింగ్ అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అక్రమ నిర్మాణమైన మేము చెప్తేనే వాటిపై చర్య తీసుకోవాలని లేకపోతే స్థానికులు ఫిర్యాదు చేశారని వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్న మీపై కఠినంగా వ్యవహరిస్తామని చోటామోటా కాంగ్రెస్ నాయకులు, చివరికి నియోజకవర్గ ఇన్చార్జిలు కూడా ఇంత నీచ స్థాయికి దిగిపోవడం ఇప్పుడు చర్చని అంశంగా మారింది. టౌన్ ప్లానింగ్ అధికారులతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న చూస్తూ ఉంటున్నామని టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్య తీసుకోవడం లేదని స్థానికులు చర్చించుకోవడం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ చోటాభడ నాయకులు అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్నారని కాంగ్రెస్ పేరును భ్రష్టు పట్టిస్తున్నారని నాయకులు చేసే అక్రమాలకు హైడ్రా వంటి సంస్థలు ఎందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉంచాలని రాత్రి పగలు కష్టపడుతూ ప్రజలకు నేనున్నానని భరోసాను కల్పిస్తూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రజా పాలనలో ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా నేనున్నానని భరోసా ఇస్తూ కాంగ్రెస్ పార్టీని గ్రేటర్ హైదరాబాద్ లో బలోపేతం దిశగా రేవంత్ రెడ్డి పావులు కదుపుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో రాబోయే కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని కసితో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని మొన్న జరిగిన జూబ్లీహిల్స్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేను గెలిపించుకోవడంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించాలని, గ్రేటర్లో కొంతమంది కాంగ్రెస్ నాయకులు(నియోజకవర్గ ఇన్చార్జీలు) ఇదే అదనుగా చేసుకొని అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటే నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఏమి చేయాలో తెలియక తమ ఉన్నతాధికారులకు తెలిపిన ఉన్నతాధికారులు కూడా మౌనం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస అవగాహన లేకుండా నాయకుల వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది. వీలు ప్రభుత్వానికి మంచి చేయడం కంటే అక్రమాలను ప్రోత్సహించడం చేస్తున్నారని అధికారులు బాధపడడం విడ్డూరంగా మారింది. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ నాయకుల జేబుల్లో అక్రమ సంపాదనను వేసుకుంటున్నారని గ్రేటర్ హైదరాబాదులో ప్రతి గల్లీలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు అండగా ఉంటూ అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్నారని ఇలాగైతే ప్రభుత్వ ఆదాయానికి భారీగా నష్టం జరుగుతుందని, ఉప కమిషనర్ కు, జోనల్ కమిషనర్ కి జరుగుతున్న తతంగం చెప్పిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

అక్రమ నిర్మాణ పై చర్యలు తీసుకుంటే టౌన్ ప్లానింగ్ అధికారులని మందలిస్తున్నారని ఇప్పటికైనా గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై క్రిమినల్ కేసులో నమోదు చేయాలని, టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసిన భవనాలను అక్రమ నిర్మాణదారులు వాటిని తొలగించి తిరిగి నిర్మాణ పనులు చేస్తున్నారని వాళ్ళపై క్రిమినల్ కేసు పెట్టే విధంగా టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్న విషయాన్ని ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షులు దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ విధానాలకు అడ్డువస్తున్న నాయకులను పార్టీ నుండి సస్పెండ్ చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

## ప్రధాని మోదీ పుట్టపర్తి పర్యటన..

### ఏర్పాట్ల కోసం ప్రత్యేక అధికారుల నియామకం

- ఏర్పాట్ల పర్యవేక్షణకు ముగ్గురు ఐఏఎస్ అధికారుల నియామకం
- సమీప జిల్లాల జేసీ, డిప్యూటీ కలెక్టర్లకు అదనపు బాధ్యతలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ
- ఏర్పాట్లపై సమీక్ష జరిపిన మంత్రుల కమిటీ

**అమరావతి (ప్రశ్న న్యూస్):** సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 19న పుట్టపర్తిలో పర్యటించనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రధాని పర్యటన సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు, రవాణా సౌకర్యాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ముగ్గురు ఐఏఎస్ అధికారులను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఐఏఎస్ అధికారులు గోపాలకృష్ణ, గోవిందరావు, కల్యాణ్ చక్రవర్తికి పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. ప్రధాని పర్యటన ముగిసే వరకు వీరు పుట్టపర్తిలోనే ఉండి ఏర్పాట్లను సమన్వయం చేస్తారు. వీరితో పాటు సమీప జిల్లాలకు చెందిన ఒక జాయింట్ కలెక్టర్ (జేసీ) మరియు 9 మంది డిప్యూటీ కలెక్టర్లకు కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకాలకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. మరోవైపు ఏర్పాట్లపై మంత్రుల బృందం నిన్న సమీక్ష నిర్వహించింది. కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యసాయి శత జయంతి వేడుకల నిర్వహణ నోడల్ అధికారులు ఎంటీ కృష్ణబాబు, వీరపాండియన్ అధికారులతో సమీక్షించారు. ప్రధాని మోదీతో పాటు రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, పలువురు ప్రముఖులు బాబా శత జయంతోత్సవాల్లో పాల్గొననున్న నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లపై సమీక్షించారు.

## ఢిల్లీ పేలుడు ఘటనలో కొత్త అంశం...

### షూలో ట్రిగ్గర్ మెకానిజం!

**ఢిలీ (ప్రశ్న న్యూస్)** ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో నవంబర్ 10న జరిగిన కారు బాంబు పేలుడు కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడిలో సూసైడ్ బాంబర్ తన 'షూ'లోనే ట్రిగ్గర్ మెకానిజం అమర్చుకుని ఉంటాడనే కోణంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) లోతుగా విచారణ జరుపుతోంది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. నవంబర్ 10న సాయంత్రం రద్దీ సమయంలో హ్యుండాయ్ %ఆ%20 కారులో శక్తిమంతమైన పేలుడు పదార్థాలతో వచ్చిన ఉగ్రవాది, మెట్రో స్టేషన్ వద్ద తనను తాను పేల్చుకున్నాడు. అత్యంత సున్నితమైన 'మదర్ ఆఫ్ సాతాన్'గా పిలిచే ట్రైయాసిటోన్ ట్రైపెరాక్సైడ్ (%ుూూ%)ను ఈ దాడిలో వాడినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ పేలుడు తీవ్రతకు కారు తునాతునకలైంది. ఘటనా స్థలంలో డ్రైవర్ సీటు కింద దొరికిన ఓ షూ దర్యాప్తును కొత్త మలుపు తిప్పింది. ఈ షూ లోపల ఉన్న మెటల్ భాగాన్ని ట్రిగ్గర్‌గా వాడి ఉండవచ్చని ఎన్ఐఏ అనుమానిస్తోంది. కారు శకలాల మధ్య లభించిన ఓ చీలిన పాదం కూడా దాడి చేసిన ఉగ్రవాదిదేనని భావిస్తున్నారు. 2001లో రిచర్డ్ రీడ్ అనే ఉగ్రవాది విమానం పేల్చేందుకు ప్రయత్నించిన 'షూ బాంబ్' ఘటనను ఈ విధానం గుర్తుచేస్తోంది. ఈ ఆత్మాహుతి దాడికి పాల్పడింది ఫరీదాబాద్‌లోని అల్-ఫలా యూనివర్సిటీలో మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన జైష్-ఇ-మొహమ్మద్ ఉగ్రవాది ఉమర్ ఉన్ నబీ అని గుర్తించారు. అక్టోబర్ 30న అతడి సహచరుడు డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్‌ను జమ్మూకశ్మీర్ పోలీసులు అరెస్ట్ చేయడంతో ఉమర్ పరారయ్యాడు. ఈ ఉగ్రవాద మాడ్యూల్‌లో ఉన్నత విద్యావంతులైన డాక్టర్లు 'వైట్ కాలర్' నెట్‌వర్క్‌గా పనిచేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఘటనా స్థలంలో 9ఎంఎం తూటాలు కూడా లభించడం పలు అనుమానాలకు తావిస్తోంది. మెవాట్ ప్రాంతంలోని హవాలా నెట్‌వర్క్ ద్వారా నిధులు సమకూరినట్లు ఆధారాలు లభించాయి. ఈ కేసులో ఇప్పటికే ఒక సహాయకుడిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. నూహ్, ఫరీదాబాద్ ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తూ దర్యాప్తును ముమ్మరం చేసింది.

# సబ్‌రిజిస్ట్రార్‌కార్యాలయాలు.. అవినీతికి నిలయాలు

- అక్కడంతా డాక్యుమెంట్ ?రైటర్లదే హవా
- రిజిస్టేషన్? కార్యాలయాల సమీపంలో అనధికారికంగా ఆఫీసులను ఏర్పాటు
- అధికారులు డాక్యుమెంట్ రైటర్లు ఏకమై అక్రమ వసూళ్ల దందాలు
- కొనుగోలు, అమ్మకందారులను నిలువునా మోసం చేస్తున్న వైనం
- అక్రమ నిర్మాణాలకు రిజిస్ట్రేషన్లు చేస్తూ కోట్లు కొల్లగొడుతున్న ఎస్ఆర్వోలు
- ఎస్ఆర్ఓ ల అవినీతి బయటపడ్డ పట్టించుకోని విజిలెన్స్, ప్రభుత్వం
- డాక్యుమెంట్లను రెడీ చేయాల్సిన రైటర్లు సబ్?రిజిస్ట్రార్? సిబ్బందికి అదనపు ఆదాయ వనరులు
- లంచాలు ఇవ్వకుంటే రిజిస్ట్రేషన్?ఆఫీస్ లో ఫైళ్లు ముందుకు కదలవు.
- అధికారులు కొర్రీలు పెడుతూ తిప్పించుకుంటారు
- కొందరు రిజిస్ట్రార్లే ప్రైవేటు ఏజెంట్లును నియమించుకుంటున్నట్లు ఆరోపణలు






మేడ్చల్ ( ప్రశ్నన్యూస్) సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్లు లేనిదే ఒక్క పని కావడం లేదు. వారి ఆధ్వర్యంలో మామూళ్ల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి అవినీతి మరక అంటకుండా వారి జేబుల్లోకి డబ్బులు దర్జాగా చేరుతున్నాయి. వారధులుగా డాక్యుమెంట్ రైటర్లు అనధికార విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి డాక్యుమెంట్ రైటర్లను ఎట్టి పరిస్థితులలో అనుమతించకూడదు. కానీ, అక్కడ ప్రతి పనీ వారి ద్వారానే జరుగుతోంది. లేకుంటే ఒక పని కూడా జరగదు ఎందుకంటే అదంతా మామూళ్ల మాయ.

### వసూలైన మొత్తం రోజంతా రైటర్ల దగ్గరే సాయంత్రానికి ఎస్ఆర్ఓ లకు అందజేత

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకునే పార్టీలు (అమ్మకం, కొనుగోలుదారులు) చలానా రూపంలో నిర్ణీత మొత్తం చెల్లించాలి. రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక సంబంధిత డాక్యుమెంట్లు కొనుగోలుదారుల చేతికి రావాలి. ప్రభుత్వ నిబంధనలు ఇలా ఉన్నా పార్టీలు నేరుగా రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లకుండా అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న డాక్యుమెంట్ రైటర్లు ఆఫీసులనే ఆశ్రయిస్తున్నారు. సంబంధిత ఆస్తి విలువ ఆధారంగా పర్సంటేజీ రూపంలో రైటర్లు వారి నుంచి వసూలు చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది పేరుతో స్టాంప్ డ్యూటీ చెల్లించే మొత్తంలో ఒక శాతం మామూళ్ల రూపంలో క్రయ,విక్రయదారుల నుండి వసూలు చేస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్ చెప్పినట్టు చేస్తే పని సాఫీగా సాగిపోతుంది. లేకుంటే కార్యాలయ సిబ్బంది సవాలక్ష కొర్రీలు పెడతారు. దీనిని దృష్టిలో పెట్టుకొని క్రయ, విక్రయదారులు వారు అడిగినంత ఇచ్చుకొని పని పూర్తి చేయించుకుంటున్నారు.

వసూలైన మొత్తం రోజంతా రైటర్ల దగ్గరే ఉంచుకుని సాయంత్రానికి సిబ్బందికి అందజేస్తున్న విషయం బహిరంగ రహస్యమే. దానితో ఒక్కొక్క ఎస్ఆర్ఓ రోజుకు రెండు లక్షల పైనే అక్రమ సంపాదన అర్జిస్తూన్నారు. మేడ్చల్ పట్టణం పురపాలక సంఘం కావడం, నిజామాబాద్ కు వెళ్లే జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భూముల్లో అధిక ధరలు పలుకుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని డాక్యుమెంట్ రైటర్లకు ఆదాయం 'మూడు పువ్వులు..ఆరు కాయలు'గా సాగిపోతోంది.

### డాక్యుమెంట్ రైటర్లకు ఆదాయం మూడు పువ్వులు..ఆరు కాయలు..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ఎన్నో ఏళ్లుగా తిష్టవేసిన డాక్యుమెంట్ రైటర్లు రిజిస్ట్రేషన్లలో చక్రం తిప్పుతున్నారు. వారికి ఎలాంటి లైసెన్సు లేవు. ఎలాంటి నియంత్రణ లేదు. డాక్యుమెంట్ రైటర్లు తయారు చేసి ఇచ్చిన డాక్యుమెంట్లనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది అంగీకరిస్తున్నారు. రైటర్లు తయారు చేసే ఒక్కో డాక్యుమెంట్ కు రూ. 3 వేల నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఎస్ఆర్ఓ కు ఇవ్వాలంటూ అదనంగా 10వేల పైనే వసూలు దండ సాగుతోంది. డాక్యుమెంట్ రైటర్లందరూ సిండికేట్ గా ఒకటే రేటును నిర్ణయించుకుని వసూలు చేస్తున్నారు. రైటర్ల వ్యవస్థ అనధికారం కావడంతో వసూలు చేసే చార్జీలపై నియంత్రణ లేదు. రైటర్లు కొత్తగా డాక్యుమెంట్ తయారు చేసేదేమీ లేదు. కంప్యూటర్లలో పొందుపరిచి ఉన్న డాటానే మార్చి పావుగంటలో డాక్యుమెంట్ తయారు చేసి భారీగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కు సంబంధించి ఎవైనా సమస్యలుంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బందికి కాసుల పండుగే. ఇలాంటి వాటికి రూ. 50వేల నుంచి లక్షలలో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు సందర్భాలలో డాక్యుమెంట్లు సరిగా ఉన్నా ఏదో సమస్య సృష్టించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది పెండింగ్ లో పెడుతున్నారు. డబ్బు ముడితే కానీ అవి కదలవు. ఈ డబ్బును కూడా డాక్యుమెంట్ రైటరే వసూలు చేసి కార్యాలయ సిబ్బందికి అందజేస్తున్నట్లు సమాచారం.

### మేడ్చల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారుల తనిఖీలు..

ప్రతి రిజిస్టర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు చేసిన అవి నామమాత్రంగానే పనిచేస్తున్నాయి. ఏసీబీ అధికారులకు కూడా ప్రభుత్వ సిబ్బంది అధికారులు అసలు భయపడడం లేదు, అంటే పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

మేడ్చల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై వచ్చిన ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు మేడ్చల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులను తనిఖీ చేశారు. అదే సమయంలో కార్యాలయంలో ఉన్న పదిమంది డాక్యుమెంట్ రైటర్లను అవినీతి నిరోధక శాఖ అధికారులు అదుపులోకి తీసుకొని విచారించినట్లు డీఎస్పీ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకునే వారు, చేసేవారు మాత్రమే ఉండాల్సిన కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు, ఏజెంట్లు ఉండడంతో వారిని విచారించి తనిఖీ చేయగా వారి వద్ద రిజిస్ట్రేషన్ చేసే డాక్యుమెంట్లు మాత్రమే ఉన్నాయని, వారి వద్ద ఎలాంటి డబ్బులు దొరకలేదని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588